

జాతీయ రహదారిపై అక్కయ్యపాలెం జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా వెళ్లిపోతున్న వాహనచోదకులు



మంగళవారం ఉదయం 9.10 గంటలకు ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో సత్యం జంక్షన్‌లో ఇష్టానుసారంగా వాహనచోదకుల రాకపోకలు

గజిబిజి... గందరగోళం

నగరంలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్

- వాహన చోదకులకు పట్టని నిబంధనలు
- సిగ్నల్‌తో సంబంధం లేదన్నట్టు రాకపోకలు
- ప్రమాదం జరుగుతుందనే స్పృహ లేకుండా రాంగ్‌రూట్‌లో ప్రయాణం
- విధి నిర్వహణలో కొందరు ట్రాఫిక్ పోలీసుల అలసత్వం
- డ్యూటీని పక్కనపెట్టి సెల్‌ఫోన్‌తో కాలక్షేపం
- వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణను పక్కనపెట్టి ఈ-చలాన్‌ల జారీలోనే ఇంకొందరు నిమగ్నం
- ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు సరిపోని సిబ్బంది
- అక్కడక్కడా పనిచేయని సిగ్నల్స్
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేటతెల్లం

ఆంధ్రజ్యోతి పరిశీలన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో ట్రాఫిక్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. వాహన చోదకుల నిర్లక్ష్యం, విధి నిర్వహణలో కొందరు పోలీసుల అలసత్వం, కొన్నిచోట్ల సిగ్నల్స్ పనిచేయకపోవడం...ఇందుకు ప్రధాన కారణాలు. ఉదయం ఏడు గంటలకు రావాల్సిన ట్రాఫిక్ పోలీసులు కొన్నిచోట్ల ఎనిమిది గంటల వరకూ కనిపించడం లేదు. మరికొందరు డ్యూటీపాయింట్‌కు వచ్చినా సెల్‌ఫోన్ పట్టుకుని ఏదోఒకచోట కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు. దీంతో వన్‌వేలో డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ సర్వసాధారణంగా మారిపోయాయి. నగరంలో జాతీయ రహదారిపై ఉదయం వేళ ట్రాఫిక్ సరళి, సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు 'ఆంధ్రజ్యోతి' బృందం మంగళవారం పరిశీలించగా అనేక లోపాలు, సమస్యలు బయటపడ్డాయి.

నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. వాహనాల సంఖ్య పెరుగుతుండడం, దానికి అనుగుణంగా రోడ్ల విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యంగా మారింది. ముఖ్యంగా సత్యం జంక్షన్, మద్దిలపాలెం, ఇసుకతోట జంక్షన్, వెంకోజీపాలెం, హనుమంతవాక, ఎండాడ, కార్‌షెడ్, కొమ్మాది జంక్షన్‌లలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తుంది. ఆయా జంక్షన్లలో రెడ్ సిగ్నల్ పడితే వాహనాలు కిలోమీటరు పొడవున ఆగిపోతున్నాయి. ఒక్కొక్కసారి సిగ్నల్ దాటడానికి పావుగంట పడుతోంది. దీంతో కొందరు సిగ్నల్ ... మిగతా 4వ పేజీలో



హనుమంతవాక జంక్షన్ వద్ద రెడ్ సిగ్నల్ పడినా ఆగని వాహనచోదకులు

యథేచ్ఛగా ట్రాఫిక్ సిగ్నల్స్ జంపింగ్

కూడళ్లలో వాహన చోదకులు కొందరు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించకుండా ఇష్టారాజ్యంగా ముందుకువెళ్లిపోతున్నారు. సిగ్నల్ జంపింగ్ వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా, ఆ విషయం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సమీపంలో ఉన్న పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నం చేయకపోవడం విశేషం.

గజిబిజి...హనుమంతవాక కూడలి

హనుమంతవాక కూడలిలో ట్రాఫిక్ మొత్తం గజిబిజిగా ఉంటోంది. రెడ్ సిగ్నల్ పడినా ఆర్టీసీ, కళాశాలల బస్సులు, ఇతర భారీవాహనాలు ఆగడం లేదు. ద్విచక్ర వాహనాల పరిస్థితి మరీ దారుణం. కాగా ఉన్న ట్రాఫిక్ సిబ్బంది కూడా చలానాలు రాసేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సెల్ ఫోన్లలో ఫొటోలు తీయడంపైనే దృష్టిసారిస్తున్నారు. వీఐపీలు వచ్చే సందర్భంలో మినహా రోడ్లపై ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పెద్దగా కనిపించడం లేదు.

ట్రాఫిక్ నిబంధనల పట్ల వాహన చోదకుల్లో నిర్లక్ష్యం

భద్రత కోసమే ట్రాఫిక్ నిబంధనలను ఏర్పాటుచేశారనే స్పృహ చాలామంది వాహన చోదకులలో ఉండడం లేదు. కొద్దిదూరమే కదా?...ఏమీ కాదులే అనే నిర్లక్ష్యంతో రాంగ్‌రూట్/వన్‌వేలో వాహనాన్ని నడపడం, సిగ్నల్ జంపింగ్‌లకు పాల్పడడం చేస్తున్నారు. ప్రమాదాలను చేతులారా కొనితెచ్చుకోవడమే కాకుండా ఎదుటివారిని కూడా అందులోకి నెడుతున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం

ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీసులు, హోంగార్డులు ప్రతిరోజూ ఉదయం ఏడు గంటలకు తమకు కేటాయించిన పాయింట్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. కూడలిలో ట్రాఫిక్ అంబరిల్లా ఉన్నట్టయితే కూర్చొని, అది లేనిపక్షంలో కూడలి మధ్యలో నిలబడి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలి. సిగ్నల్‌ను బట్టి వాహనాలను నడిపేలా చూడడంతోపాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిని సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి ఈ-చాలాన్ జారీచేయాల్సి ఉంటుంది. అయితే కొమ్మాది నుంచి అక్కయ్యపాలెం పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు ట్రాఫిక్ విధుల్లో ఉన్నవారిలో మంగళవారం ఒకరిద్దరు తప్పితే ఎవరూ ఉదయం ఏడు గంటలకు విధులకు హాజరుకాలేదు. కొందరు ఏడున్నర గంటలకు, మరికొందరు ఎనిమిది గంటల సమయంలో తమ పాయింట్‌కు చేరుకున్నారు.



అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద ట్రాఫిక్‌ను పట్టించుకోకుండా మొబైల్స్ చూస్తున్న పోలీసులు



మద్దిలపాలెం జంక్షన్ వద్ద మొబైల్‌తో కాలక్షేపం

సెల్‌ఫోన్‌తోనే అత్యధికులు కాలక్షేపం

కొందరు ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పక్కనపెట్టేసి సెల్‌ఫోన్ పట్టుకుని రీల్స్, ఫేస్‌బుక్ చూసుకుంటూ కాలక్షేపం చేశారు. మరికొందరు రోడ్డు మధ్యలో నిలబడి సిగ్నల్‌కు అనుగుణంగా వాహనాలు ముందుకు కదలేలా చూడడం మానేసి పెండింగ్ ట్రాఫిక్ చలాన్‌ల వసూళ్లపైనే నిమగ్నమయ్యారు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్ లైట్లు



ఫోర్త్‌టౌన్ జంక్షన్ వద్ద వెలగని ట్రాఫిక్ సిగ్నల్స్ లైట్లు

నగరంలో చాలాచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు. మద్దిలపాలెం కూడలిలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ద్వారకా బస్‌స్టేషన్, జగదాంబ జంక్షన్ వైపు వెళ్లే వాహనాల కోసం ఏర్పాటుచేసిన సిగ్నల్స్ నెలల తరబడి పనిచేయడంలేదు. అలాగే సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్ వైపు నుంచి శంకరమఠం వైపు వెళ్లేవారి కోసం జాతీయ రహదారిపై ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన పెట్రోల్‌బంకు వద్ద ఏర్పాటుచేసిన ట్రాఫిక్ సిగ్నల్ పనిచేయడం లేదు. దీనివల్ల అటువైపు నుంచి శంకరమఠం వైపు వెళ్లే వాహనచోదకులు ఎప్పుడు ఆగాలో, ఎప్పుడు ముందుకువెళ్లాలో తెలియక ఇష్టారాజ్యంగా ముందుకు వెళ్లిపోతున్నారు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సిగ్నల్స్ పనిచేయడం లేదని అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



బుల్లయ్య కళాశాల వద్ద ఈ-చలాన్‌లు తనిఖీలు చేస్తున్న పోలీసులు

క్రికెట్ సందడి

విరాట్, రోహిత్ బ్యాటింగ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానుల ఎదురుచూపు



- 6న మ్యాచ్
- హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన టికెట్లు
- డిజిటల్ టికెటింగ్
- నో సీటు నంబరు?

విశాఖపట్నం-స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 6న దక్షిణాఫ్రికాతో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్ కోసం క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విరాట్ కొహ్లి, రోహిత్‌శర్మ బ్యాటింగ్‌ను ఎప్పుడు వీక్షిస్తామా అనే ఉత్సుకతతో ఉన్నారు. రాంచీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీతో కొహ్లి, అర్ధ సెంచరీతో రోహిత్‌శర్మ వీరవిహారం చేయడంతో ఇక్కడ జరగనున్న మ్యాచ్‌కు మరింత క్రేజ్ వచ్చింది. అందుకే ఇప్పటివరకూ విశాఖలో జరిగిన పది వన్డే మ్యాచ్‌లతో పోల్చితే ఈసారి టికెట్ ధరలు భారీగా పెంచినా క్రీడాభిమానులు వెనకాడకపోవడం గమనించదగ్గ విషయం.

22 వేల టికెట్లు హాంఫట్

ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సామర్థ్యం సుమారు 27 వేలు కాగా, నిర్వాహకులు 22 వేల టికెట్లు ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచారు. గంటల వ్యవధిలోనే టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అయిపోయాయి. గతంలో ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్ల విక్రయాలు జరిగేవి. ఆన్‌లైన్‌లో టికెట్ తీసుకోవడం రానివారు, దొరకనివారు... ఆఫ్‌లైన్‌లో ఏర్పాటుచేసే విక్రయ కేంద్రాల వద్ద అర్ధరాత్రి నుంచి కాపుకాసి టికెట్ పొందిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రస్తుత ఏసీఏ కార్యవర్గం అటువంటి చర్యలు చేపట్టకపోవడంపై క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ టికెటింగ్... నో సీటు నంబరు

ఈ మ్యాచ్‌కు డిజిటల్ టికెటింగ్‌ను ప్రవేశపెడుతున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద టికెట్ స్కాన్ చేసి లోపలకు ప్రవేశించాల్సిందే. ఒకరు లోపలకు వెళ్లి, దొడ్డిదారిలో ఆ టికెట్‌ను బయట ఉన్న మరొకరికి అందించినా ఫలితం ఉండదు. ఒకసారి స్కాన్ అయిన టికెట్‌కు రెండోసారి అవకాశం ఉండదు. అంత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మ్యాచ్‌కు సీటు నంబరింగ్ ... మిగతా 4వ పేజీలో

ఉక్కు మంత్రి కుమారస్వామి రాక రేపు

- ఫెర్రో అల్లాయిస్ పారిశ్రామికవేత్తలతో భేటీ
- స్టీల్‌ప్లాంటు సందర్శనపై స్పష్టత కరవు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):



కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి గురువారం విశాఖపట్నం వస్తున్నారు. ఫెర్రో అల్లాయిస్ పారిశ్రామికవేత్తలతో స్టీల్ ప్లాంటు ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా నోవాటెల్ హోటల్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అందులో కేంద్ర మంత్రి పాల్గొంటారు. సక్సేనా మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (ఎంఓఐఎల్) ఎండీగా పనిచేస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంటుకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు ఎంఓఐఎల్ మాంగనీస్ సరఫరా చేస్తుంది. దానికి సంబంధించి నోవాటెల్‌లో సమావేశం నిర్వహిస్తున్నారు. స్టీల్ ప్లాంటులో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మంత్రి ప్లాంటుకు వస్తారా?, రారా?...అనేది తెలియడం లేదు. దీనిపై అధికార వర్గాలు ఏమీ సమాచారం ఇవ్వడం లేదు.

సీ ప్లేన్ రెక్కలు తొడిగేనా?

- దశాబ్దకాలంగా ప్రతిపాదనలు
- ఇప్పటికీ కార్యరూపం దాల్చని వైనం
- రుషికొండ, లంబసింగి, అరకులోయ అనువైన ప్రాంతాలుగా గుర్తించినట్టు తాజాగా పర్యాటక శాఖా మంత్రి ప్రకటన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సీప్లేన్ నడపడానికి పర్యాటక శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. రుషికొండ, అరకులోయ, లంబసింగి ప్రాంతాలు దీనికి అనువైన ప్రాంతాలుగా గుర్తించినట్టు పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తాజాగా ఓ సమావేశంలో వెల్లడించారు. దీంతో ఎప్పటి నుంచో విశాఖలో ప్రారంభించాలని అనుకుంటున్న సీప్లేన్ ప్రతిపాదనల్లో కదలిక వచ్చినట్టయింది. తెలుగుదేశం ప్రభుత్వం విశాఖలో 2016లో నిర్వహించిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో దీనిపై చర్చ జరిగింది. చెన్నైకు చెందిన స్కై చాపర్స్ అనే సంస్థ హెలికాప్టర్లతో పాటు సీప్లేన్లను విశాఖపట్నంలో నడుపుతామని ముందుకువచ్చింది. భీమిలి నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్ నడుపుతామని ప్రకటించింది.



ఆ తరువాత చంద్రబాబునాయుడు పలు పర్యాటక సంస్థలతో సమావేశం నిర్వహించగా, చంద్రశేఖర్ అనే పారిశ్రామికవేత్త సీ ప్లేన్ నడపుతామని ఆసక్తి వ్యక్తంచేశారు. భీమిలి సమీపాన మంగమారిపేటలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మిస్తే సీ ప్లేన్ నడుపుతామని చెప్పారు. ఆ మేరకు ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాలని 2016లోనే చంద్రబాబు ఆదేశించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు.

విశాఖపట్నం పోర్టు కూడా సీ ప్లేన్ నడపడానికి మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు ... మిగతా 4వ పేజీలో

మరో 450 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు

- ఉక్కు వర్గాల్లో తీవ్ర ఆందోళన



ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియను యాజమాన్యం కొనసాగిస్తోంది. తాజాగా మంగళవారం సుమారు 450 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించినట్టు సమాచారం. ఆరు నెలలుగా స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం దశల వారీగా తొలగిస్తోంది. తొలివిడత 1,503 మందిని తొలగించింది. రెండో విడతగా మరో 1,542 మంది కార్మికులను నిలిపివేసింది. ఇలా ఏకంగా మూడు వేలకు పైగా కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు ఉపాధికి దూరమై రోడ్డున పడడంతో భారీఎత్తున ఉద్యమాలు చేశారు. ఈ నేపథ్యంలో యాజమాన్యం తొలగింపు ప్రక్రియను తాత్కాలికంగా పక్కనపెట్టింది. ఇది కార్మిక విజయంగా భావించారు. అయితే కొద్దికాలంగా తిరిగి రోజుకు పది మంది చొప్పున తొలగిస్తూ వస్తున్నది. దీనిపై కార్మికులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వడం లేదు. విధులకు హాజరయ్యేందుకు వెళితే లేబర్ గేటు వద్ద బయోమెట్రిక్ నమోదుకావడం లేదు. దీంతో తొలగించినట్టు లెక్క. మొత్తంగా కాంట్రాక్టు కార్మికుల సేవలను దూరం చేసే ఆలోచనలో యాజమాన్యం ఉంది. ఈ దఫా మరో 450 మందిపై వేటు వేసింది. సమాచారం లేకుండానే కార్మికులను నిలిపివేస్తుండడంతో ప్రతిరోజూ భయంభయంగా విధులకు హాజరవుతున్నామని వారంతా వాపోతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం తొలగించిన కార్మికుల్లో నిర్వాసిత కార్మికులు ఎవరూ లేరని సమాచారం.

అష్ట దిగ్బంధనంలో వాహన చోదకులు


మధురవాడ కారు షెడ్ కూడలిలో నిత్యం ఇదే పరిస్థితి



కొమ్మాది జంక్షన్‌లో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు

మధురవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై కారు షెడ్ కూడలికి చేరుకుంటున్న వాహన చోదకులకు వాహనాల శ్రేణులు చుక్కలు చూపిస్తున్నాయి. నగరం-ఆనందపురం మార్గంలో రెండు వైపులా ట్రాఫిక్ పరిస్థితి దుర్భరంగా మారింది. గ్రీన్‌సిగ్నల్ పడినా ఈ కూడలి దాటడానికి కనీసం రెండు టర్నులు ఆగాలి. ఇద్దరు కానిస్టేబుళ్లు మాత్రమే విధులు నిర్వహిస్తుంటారు. వుడాకాలనీ, వాంబేకాలనీ, పాతమధురవాడ మెట్ట, పిలకవానిపాలెం, పోతినమల్లయ్యపాలెం, ఆర్‌హెచ్‌కాలనీ తదితర పది ప్రాంతాల వాహనాలు ఈ కూడలి పైనుంచే వెళ్లాలి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిపోయే వాహనాలు కారు షెడ్ కూడలి దాటుకునే రాకపోకలు సాగించాలి. ఉదయం 8-10 గంటల మధ్య, సాయంత్రం 4-6 గంటల మధ్య విద్యాసంస్థల బస్సులు, కార్యాలయాలకు వెళ్లేవారితో కారుషెడ్ కూడలి రహదారులు కిటకిటలాడుతాయి. కొందరు ద్విచక్రవాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కూడలిలో పాదచారులకు సిగ్నల్ వ్యవస్థలో సమయం కేటాయించక పోవడంతో వాహనాలు వెళుతున్న సమయంలోనే రోడ్డు దాటవలసి వస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, పిల్లలు రోడ్డు దాటడం ఇబ్బందికరంగా ఉంది. గతంలో మధురవాడ నుంచి కారు లేదా ద్విచక్రవాహనంపై నగరానికి వెళ్లడానికి కనీసం 20 నిమిషాలు పట్టేది. ప్రస్తుతం వాహనాల సంఖ్య పెరిగిపోవడంతో గంటకు పైగా సమయం పడుతోంది. వ్యక్తిగత వాహనాలు అసంఖ్యాకంగా పెరిగాయి. కారుషెడ్ కూడలిలో జాతీయరహదారిపై ప్రతీ పది నిమిషాలకు సుమారు వెయ్యి వాహనాలు ప్రయాణిస్తుంటాయని ఓ అంచనా.

ఇలా చేస్తేనే ప్రయోజనం

● ట్రాఫిక్ పోలీసుల సంఖ్య పెంచడం, హౌసింగ్‌బోర్డు కాలనీ ఫ్రీలెఫ్ట్ రోడ్డును విస్తరించడం, పాదచారులు రోడ్డుదాటడానికి సమయం కేటయించడం, డివైడర్ల వెడల్పు తగ్గించడం, వరుస క్రమంలో నాలుగువైపులా గ్రీన్‌సిగ్నల్‌ను నియంత్రించడం, మాన్యువల్ క్లియరెన్స్ వల్ల సర్వీసు రోడ్డులో ఉన్న వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నందున సిగ్నల్ వ్యవస్థనే అమలు చేయడం, సిగ్నల్ జంప్ చేస్తున్న వారిని వెంటనే గుర్తించి నియంత్రించడం.

కొమ్మాది జంక్షన్‌లో ఎవరిష్టం వారిదే!

కొమ్మాది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి ఉపాధి నిమిత్తం విశాఖ నగరానికి అనేకమంది వచ్చి మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడ విద్యాసంస్థలు కూడా గణనీయంగా పెరగడంతో నగరంలోకి ఉద్యోగ, ఉపాధి కోసం వెళ్లేవారు అధికం. దీంతో కొమ్మాది జంక్షన్ వద్ద ఉదయం 8 నుంచి 10గంటల వరకు వాహనాల రద్దీ నెలకొంటుంది. ఈ సమయంలోనే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. జంక్షన్‌లో సిగ్నల్ పడగానే క్లియర్ అయ్యే వరకు వేచి ఉండకుండా కొమ్మాది పెట్రోల్‌బంకు వద్ద సర్వీస్‌రోడ్డులోకి వాహనాలను మళ్లిస్తున్నారు. జాతీయ రహదారి, సర్వీస్ రోడ్డులో కూడా వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంటుంది. కొమ్మాది జంక్షన్ వద్ద నుంచి మారికవలస సిగ్నల్ వరకు, నగరానికి వెళ్లే మార్గంలో శిల్పారామం వరకు వాహనాలు బారులుతీరుతున్నాయి. ఉదయం 8-10 గంటల మధ్య ట్రాఫిక్ సిగ్నల్‌ను నిలిపివేసి పోలీసులు మాన్యువల్‌గా రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈ సమయంలో ముగ్గురు పోలీసు సిబ్బంది మాత్రమే పనిచేస్తున్నారు. వాహనాలు ఒకేసారి కదలడంతో ఎవరు ఎటువైపు వెళ్తారో అర్థంకాక గందరగోళ పరిస్థితి నెలకొంటుంది. కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ సిబ్బంది సూచనలు పట్టించుకోకపోవడంతో విపరీతమైన ట్రాఫిక్ జాం ఏర్పడి వాహనదారుల సహనానికి పరీక్ష పెడుతుంది. ఇక్కడ ఫ్లైవోవర్ల నిర్మాణం తప్పనిసరి అని పరిస్థితులు చాటిచెబుతున్నాయి. భవిష్యత్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానుండడం, ఐటీ పరిశ్రమలు రానుండడంతో మరింత దుర్భర ట్రాఫిక్ పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉంది.

హిందీ, తెలుగు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస, డిసెంబరు 02 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 2వ వార్డు రాయిపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ తెలుగు 18వ వార్డు మున్సిపల్‌ఉన్నత పాఠశాలలో హిందీ స్కూలు అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయడానికి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు పేరుతో అర్హులైన వారికి నియమిస్తున్నామని మండల విద్యాశాఖాధికారిణి ఎం. శివరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులు 8.12.2025 నుంచి 7.5.2026 వరకు 5 నెలల పాటు ఉంటాయని,ఎంపికైన వారు ఆయా పాఠశాలల్లో సంబంధిత సబ్జెక్టులను బోధించాల్సి ఉంటుందన్నారు. వీరికి నెలకు రూ12,500ల వేతనంగా చెల్లిస్తారన్నారు. తమ అర్హతల ధ్రువపత్రాలతో పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 5లోపు భీమిలి మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలోఅందించాలని సంబంధిత దరఖాస్తులు కూడా ఎంఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని అన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉపాధి మెరుగు

» ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీవాణి


కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి

తగరపువలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, కంప్యూటర్ జ్ఞానం ఉన్న వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా వస్తాయని తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీవాణి పేర్కొన్నారు. ప్రపంచ కంప్యూటర్ లిటరీసీ వేడుకలను మంగళవారం తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన ఉంటే నేర్చుకునే శక్తి పెరుగుతుందని, ప్రపంచంలో విజ్ఞానాన్ని అనుసంధానం చేసుకుని కొత్త కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులంతా ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్‌ను నేర్చుకోవాలని ఇంటర్‌నెట్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కంప్యూటర్ క్విజ్‌లో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ అధ్యాపకురాలు ఆర్.రజని, ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అన్యాయం'

పద్మనాభం-రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటపరం చేయడం దుర్మార్గమని, ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వాపసు తీసుకోవాలని భీమిలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం కొవ్వాడలో పార్టీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందన్నారు. వైద్యకళాశాలలు నిర్ణయాన్ని విరమించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కె.రాంబాబు, జడ్పీ వైస్‌ఛైర్మన్ సుంకరి గిరిబాబు, సత్యనారాయణ, నేతలు మురళీరాజు, అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీసభ్యులు పాల్గొన్నారు.

వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవన నిర్మాణ పనులకు శ్రీకారం

ఆరిలోవ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని ఫైనాపిల్‌కాలనీలో గల మహిళా ప్రాంగణంలో వర్కింగ్ ఉమెన్స్ భవనాలను నిర్మించేందుకు స్థలం చదును చేసే కార్యక్రమం జీవీఎంసీ సిబ్బంది చేపడుతున్నారు. ఇక్కడ ఉన్న పాతబడిన మహిళా ప్రాంగణ సిబ్బంది భవన సముదాయాలను ఎక్సకవేటర్లతో తొలగించారు. సుమారు రెండు ఎకరాల భూమిలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ భవనాలను నిర్మాణం చేయనున్నారు.

నూతన ఆవిష్కరణలపై గీతం యూనివర్సిటీలో చర్చ



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

సాగర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యామంత్రిత్వశాఖలోని ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ప్రాంతీయ సమావేశాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించారు. నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను వివరించారు. సమావేశంలో నూతన ఆవిష్కరణలపై చర్చా వేదికలు, ఇన్నోవేషన్ ప్రదర్శనలు, స్టార్టప్ షోకేస్‌లు, ఆలోచనల సమర్పణ, శిక్షణ సెషన్లు, యువ ఇన్నోవేటర్లు, సంస్థాగత బృందాలకు మార్గనిర్దేశం చేసే పరిజ్ఞానం పంచుకునే కార్యక్రమాలు నిర్వహించారు. గీతం ప్రో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ యువతలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ)ని ఏర్పాటు చేశామన్నారు. స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ సీఈవో డాక్టర్ బి.వి.ఆర్.మోహన్‌రెడ్డి, సీఈవో సుధాకర్ పొటుకూచి, ఆర్‌టీఐహెచ్ విశాఖపట్నం సీఈవో డాక్టర్ రవి ఈశ్వరప్ప, వాద్వాని ఫౌండేషన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్స్ డైరక్టర్ దయాకర్ ఎస్.మూర్తి, విద్యా మంత్రిత్వ శాఖ ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌బుద్ధ, విద్యామంత్రిత్వశాఖ ఇన్నోవేషన్ సెల్ ఏఐసీటీఈ ఇన్నోవేషన్ ఆఫీసర్ సెల్వరాణి సెల్వకుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు తదితరులు ప్రసంగించారు. ఉన్నత విద్యాసంస్థలో ఆవిష్కరణలు, స్టార్టప్‌ల సంస్కృతిని బలోపేతం చేయడం లక్ష్యంగా ఐఐసీ పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇన్నోవేటర్లు, అధ్యాపకులు, ఎకోసిస్టమ్ ఎనేబ్లర్లు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, స్టూడెంట్ అంబాసిడర్లు, ఐఐసీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల మొత్తం బకాయిలు చెల్లిస్తేనే భూములపై అటాచ్‌మెంట్ తొలగించాలి

» ఐఎన్‌టీయూసీ


చిట్టివలసలో జరిగిన ఐఎన్‌టీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు నర్సింహరాజు

తగరపువలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన లక్షలాది రూపాయల పరిహారాలు అన్నీ పూర్తిగా చెల్లిస్తేనే వారి భూములపై కార్మిక సంఘాలు సబ్ రిజిస్ట్రార్ ద్వారా విధించిన అటాచ్‌మెంట్ తొలగించాలని అధికారిక కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సమావేశం తీర్మానించింది. మంగళవారం చిట్టివలస జూట్‌మిల్లు వద్ద జరిగిన ఈ సమావేశానికి సంఘ అధ్యక్షుడు కేవీ నర్సింహరాజు అధ్యక్షత వహించారు. ఈనెల 4న విశాఖ జడ్పీ సమావేశ మందిరంలో కార్మిక శాఖ యాజమాన్యం పీఎఫ్ అధికారులు కార్మిక సంఘాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ సమావేశంలో తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఈ చర్చించారు. జడ్పీలో నిర్వహించనున్న సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కూడా ఆహ్వానించాలని, ఇందుకోసం కార్మికశాఖ కార్యదర్శి గందం చంద్రుడుకి లేఖ రాయాలని సమావేశం తీర్మానించింది. కార్మికులకు పీఎఫ్ పరిహారాలు, దాచుకున్న మొత్తాలు చెల్లించడం, మారుపేరుతో పని చేసిన కార్మికులకు చెల్లింపులు చేయడం వంటి పనులు చేస్తే తప్ప, వారి భూములు విక్రయించేందుకు అడ్డంకిగా ఉన్న అటాచ్‌మెంటును తొలగించరాదని సమావేశం తీర్మానించింది. అటాచ్‌మెంట్‌ను తొలగించాలని యాజమాన్యం పట్టుపడుతున్నదని, దాని ని తొలగిస్తే చెల్లింపులు చేయకుండా యాజమాన్యం తన భూములను అమ్ముకుని ఇక్కడి నుంచి వెళిపోతుందని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు చిల్ల వెంకటరమణ, జీరు వెంకటరెడ్డి, కొయ్య సూరిగురువులు, సరగడ శ్రీరామమూర్తి, సూరిబాబు, వాకాడ గోవింద, అప్పలచిట్టి, పోలిపల్లి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మూడు పతకాలు సాధించిన ద్వారక



భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం మూలకుద్దు కేథరిన్ విద్యాసంస్థలో ఆరో తరగతి చదువుతున్న గ్రేస్ ద్వారక బాలికల విభాగంలో కరాటే పోటీల్లో మూడు విభాగాలను అధిగమించి బంగారు పతకాన్ని సాధించింది. అండర్-14 విభాగంలో స్కూలు గేమ్స్ పెడరేషన్ వారు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో గత నెల 30, ఈ నెల 1వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు రోజుల పాటు జరిగిన కరాటే పోటీలలో వరుసగా మూడు విభాగాల్లో విజయం సాధించి బంగారు పతకాన్ని పొందింది. దీంతో ఈ నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీకు కూడా ఎంపికైందని. ఈ విద్యాసంస్థల అధినేత ఆలీవర్ రాయి ఒక ప్రకటనలో తెలిపారు

అంతేకాకుండా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన 22రకాల పోటీల్లో కుజిత (6వ తరగతి) ఎ.లిఖిత (9వ తరగతి) పూజిత (6వ తరగతి) కూడా కరాటే పోటీల్లో అత్యున్నత ప్రతిభను చూపించారని, వీరు వ్యక్తిగత కాంస్య పతకాలను సాధించారని తెలిపారు. స్పోర్ట్సు ర్యాంకింగ్‌లో తమ పాఠశాల జిల్లాలో రెండో స్థానాన్ని పొందిందని, విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో కరాటే పోటీల్లో విజయం సాధించిన వారికి జాతీయ స్థాయికి ఎంపికైన బాలికను ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది అభినందించారు.

అన్నవరంలో భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగం, ఆరు సెంట్లు స్థలం

» రైతులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ

» ఆనందం వ్యక్తం చేసిన అన్నదాతలు


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పాల్గొన్న జడ్పీటీసీ వెంకటప్పుడు, తహశీల్దార్ పి.రామారావు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలంలోని అన్నవరంలో ఓబెరాయ్, మేఫెయిర్ హోటళ్ల కోసం స్థలాలు కేటాయించిన నేపథ్యంలో భూములు కోల్పోయిన 28 మంది రైతులకు ఇంటికో ఉద్యోగం, ఆరు సెంట్ల స్థలాన్ని అందిస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం విశాఖలో ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ రైతులు గత కొన్నేళ్లగా భూములను సాగు చేసుకుంటున్నారని, వారినుంచి ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకుందన్నారు. వీరికి సాగుకు సంబంధించిన ఎటువంటి అధికారిక రికార్డులు లేనందువల్ల పరిహారం సాధ్యపడదని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో వీరు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొని వచ్చారు. దీంతో ఈ హోటళ్ల నిర్మాణం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఈ రైతులతో సమావేశమై భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం ప్రతి రైతులకు ఆరుసెంట్ల స్థలాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వీరు కోర్టులో తాము వేసిన కేసును వెనక్కు తీసుకోవడానికి అంగీకరించారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారం కావడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేసారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు వెంకటప్పుడు, తహశీల్దార్ పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు బ్యూటీథెరపీలో ఉచిత శిక్షణ



ఉప్పాడలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జగదీశ్

భీమునిపట్నం(రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భీమిలిమండలం చిప్పాడ స్కిల్ డెవలప్‌మెంటు కేంద్రంలో గ్రామీణ మహిళలకు బ్యూటీ థెరపిస్టు శిక్షణ కార్యక్రమాన్ని దివీస్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజరు పి.జగదీష్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కేంద్రం పరిధిలోని అన్నవరం, చిప్పాడ, నాగమయ్యపాలెం, మూలకుద్దు తదితర గ్రామాల నుంచి 60 మంది మహిళలు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం.. జగదీష్ మాట్లాడుతూ ఈ శిక్షణ మహిళలకు ఆర్థిక సాధికారిత అందిస్తుందన్నారు. శిక్షన అనంతరం అందించే సర్టిఫికెట్‌తో సొంతంగా బ్యూటీ పార్లర్ కూడా పెట్టుకునే వీలుంటుందన్నారు. సమావేశంలో దివీస్ సామాజిక సేవా విభాగం మేనేజర్ డి.సురేష్‌కుమార్, సిబ్బంది ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ లైట్ల ఏర్పాటుకు విరాళం

పద్మనాభం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనంతపద్మనాభుడి గిరి ఘాట్ రోడ్డు మార్గంలో సోలార్ లైట్లు ఏర్పాటుకు దాతలు ముందుకు వస్తున్నారు. దీంతో ఇప్పటివరకూ 20 లైట్లను సమకూర్చారు. దీనిపై దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ టి.అన్నపూర్ణదేవి సైతం ఒక సోలార్ లైటు ఏర్పాటు కు అవసరమైన రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. ఇందుకోసం నగదును ఆలయ ఈవో పీఎల్ఎన్ రాజు ద్వారా పంపించి ఈకార్యక్రమాన్ని చేపడుతున్న ఉత్సవ కమిటీకి అందజేశారు. ఇప్పటి వరకు ఈలైట్ల ఏర్పాటునకు ముందుకు వచ్చిన దాతలకు, దేవాదాయశాఖ అసిస్టెంటు కమిషనర్‌కు ఉత్సవ కమిటీ తరఫున ధన్యవాదాలు తెలిపారు.

'సెయిల్' రిటైర్డ్ ఉద్యోగికి మూడేళ్ల జైలు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో 'సెయిల్' రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాగం కిశోర్‌కు మూడేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. రాగం కిశోర్ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)లో పనిచేస్తున్నప్పుడు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని సీబీఐ సోదాలు నిర్వహించింది. 1988 జనవరి నుంచి 2000 ఏప్రిల్ 19 వరకు ఆస్తులు పరిశీలించగా స్థిరచరాస్తులన్నీ కలిపి రూ.60,25,825 ఉన్నట్టు గుర్తించారు. వాటిని ఎలా సంపాదించారనే దానిపై ఆయన సీబీఐకి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయారు. దానిపై సీబీఐ కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. సుదీర్ఘంగా సాగిన ఈ కేసులో విశాఖపట్నం సీబీఐ కోర్టు మూడేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది.

ఎల్‌యూబీతో గీతం అవగాహన ఒప్పందం

సాగర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోని చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సహకరించడానికి లఘు ఉద్యోగ్ భారతి(ఎల్‌యూబీ) సంస్థతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మంగళవారంఅవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రోవైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు, ఎల్‌యూబీ ప్రతినిధులు ఓం ప్రకాష్‌గుప్తా, టి.యోగేష్‌చంద్ర, ఎ.కృష్ణబాలాజి ఒప్పందంపై సంతకాలు చేశారు. .వందకోట్ల వ్యయంతో గీతం మూర్తి ప్రయోగశాలలు ఏర్పాటు చేసి పరిశ్రమలకు ఉపయోగపడే పరిశోధనలు చేపడుతున్నామని గౌతమ్‌రావు వెల్లడించారు. ఎల్‌యుబి జాతీయ కోఆర్డినేటర్ జయంతి గోయల మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ ద్వారా యువతకు నేర్పును అందించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఎల్‌యుబి ప్రతినిధి బృందం గీతంలోని వివిధ పరిశోధన కేంద్రాలను, ప్రయోగశాలలను సందర్శించారు.

అప్పన్న సన్నిధిలో తిరునక్షత్ర పూజలు


పారాయణం చేస్తున్న అధ్యాపకులు

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో వైభవంగా తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు జరుగుతున్నాయి. విశిష్టాద్వైత మతవ్యాపకులు ఆళ్వార్ల తిరునక్షత్ర పూజోత్సవాలను ఏటా ఐదురోజులు జరుపుతారు. నవంబరు 30న ప్రారంభమైన పూజలు మంగళవారం కూడా సంప్రదాయబద్ధంగా కొనసాగించారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ సారథ్యంలో అధ్యాపకులు వైదిక సం ప్రదాయంలోని ప్రధానమైన నాలాయిర దివ్య ప్రబంధంలోని సుమారు వెయ్యిపాశురాలను అనుసంధానం కావించారు. మధ్యాహ్నం రాజభోగం వేళ ప్రత్యేక నివేదనలు జరిపితీర్థగోష్ఠి నిర్వహించి తొలుత వేకువన సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులు, ఆళ్వార్లతో అలంకరించి ప్రత్యేకవేదికపై అధిష్టింపచేసి ఉపచారాలు సమర్పించారు.

అభివృద్ధి పనులకు కార్పొరేటర్ భూమి పూజ

కొమ్మాది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత అన్నారు. మంగళవారం పరదేశిపాలెంలో రూ.40లక్షల వ్యయంతో చేపట్టనున్న సామాజిక భవనం, రోడ్లు, కాలువల పనులకు ఆమె భూమిపూజ చేశారు. దశలవారీగా పనులు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. నేతలు మొల్లిలక్ష్మణరావు, ఈగలరవి, ఏఈ తిరుమలరావు, దేవరశివ, కొండపురాజు, మన్యాలసురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

సింహాచలం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధాలయం సాక్షి ఆంజనేయస్వామి సన్నిధానంలో హనుమత్ వ్రతం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. సుప్రభాతసేవ, ప్రభాతారాదనలు చేశారు. పండితులు సుందరకాండ సర్గ పారాయణం చేయగా అర్చకులు రమేష్ నివేదనలు సమర్పించి మంగళ నీరాజనాలిచ్చారు.

ముగిసిన అన్నదాన కార్యక్రమం

కొమ్మాది, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పీఎం పాలెం పరశురాం గురుస్వామి అయ్యప్ప పీఠం వద్ద 41 రోజులుగా నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం మంగళవారంతో ముగిసిందని ట్రస్టు సభ్యులు పోతిన ఎల్లాజీ, వాండ్రాసి భాస్కర్ తెలిపారు.

గజిబిజి.. గందరగోళం...

... 3వ పేజీ తరువాయి

జంపింగ్‌కు పాల్పడుతున్నారు. మరికొందరు వన్‌వేలో, రాంగ్‌రూట్‌లో వాహనాన్ని నడుపుతున్నారు. ఇలాంటి వాటన్నింటికీ అడ్డుకట్ట వేసి ట్రాఫిక్ నిబంధనలను పక్కగా పాటించేలా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసుల్లో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనాల రాకపోకలను పట్టించుకోకుండా ఇతర పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

నగరంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడకుండా చర్యలు తీసుకోవడం, నిబంధనలు ఉల్లంఘించే వారికి ఈ-చలాన్‌లను జారీచేయడం వంటి విధులను ట్రాఫిక్ సిబ్బంది నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనికోసం మద్దిలపాలెం, హనుమంతవాక, పీఎం పాలెం జంక్షన్, కార్‌షెడ్‌జంక్షన్, కొమ్మాది వంటి కూడళ్లలో కనీసం ఇద్దరు సిబ్బంది అవసరం. కానీ ఆయా కూడళ్ల వద్ద ఒక్కరినే కేటాయిస్తున్నారు. ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ పేరుతో నాలుగైదు పోలీస్ స్టేషన్ల పరిధిలో జాతీయ రహదారిపై పెట్రోలింగ్ కోసం కేటాయించే వాహనానికి డ్రైవర్ కాకుండా ఇద్దరు సిబ్బంది ఉంటున్నారు. ఆ వాహనంలో సిబ్బంది ఒక్కో కూడలి వద్ద ఆగి అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వర్తించే కానిస్టేబుల్/హోంగార్డుతో ముచ్చట్లు పెట్టుకుని కొంతసేపటి తర్వాత వెళ్లిపోతున్నారు. అలాకాకుండా ప్రధాన కూడలి వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు/హోంగార్డులను నియమిస్తే సిగ్నల్ జంపింగ్‌లకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుంది.

'సీ ప్లేన్' రెక్కలు తొడిగేనా?

... 3వ పేజీ తరువాయి

సిద్ధం చేసింది. డీపీఆర్ కూడా రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకం ప్రవేశ పెట్టడంతో అందులో దీనిని చేర్చాలని పౌర విమానయాన శాఖకు లేఖ రాసింది. సీ ప్లేన్‌కు అవసరమైన జెట్టీ నిర్మిస్తామని ప్రతిపాదించింది. అయితే రూ.100 కోట్లతో చేపట్టిన క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణంలో నిమగ్నమైన పోర్టు అధికారులు, దీనిపై దృష్టి పెట్టలేకపోయారు. ఇప్పుడు క్రూయిజ్ టెర్మినల్ ఖాళీగానే ఉంది. అక్కడి నుంచి సీప్లేన్ నడుపుకునే అవకాశం ఉంది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ, శ్రీశైలం, హుస్సేన్ సాగర్ (హైదరాబాద్), చిలకా సరస్సు (ఒడిశా) తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి డిమాండ్ ఉంది. సీ ప్లేన్ నీటిపైన, భూమిపైన ల్యాండ్ అవుతుంది. అలాగే ఎక్కడి నుంచైనా టేకాఫ్ తీసుకోగలుగుతుంది. లోకల్ టూరిజం కింద విశాఖపట్నం నుంచి రుషికొండ, భీమిలి, అరకు, లంబసింగి నడపొచ్చు. అధికారులు ఈ దిశగా కృషి చేస్తే విశాఖకు మరో కొత్త పర్యాటక ఆకర్షణ జత కలుస్తుంది.

క్రికెట్ సందడి

... 3వ పేజీ తరువాయి

విధానం అమలు చేయడం లేదని తెలుస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ మాదిరిగా ముందు వచ్చినవారు తమకు ఇష్టమైన సీట్లలో కూర్చోవచ్చు. అయితే ఈ విధానంతో సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముందుగా వచ్చి ముందు సీటులో కూర్చొన్న వ్యక్తి వాష్‌రూమ్ లేదా వేరే అవసరాలతో అక్కడ నుంచి వెళితే...మరొకరు కూర్చొనే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదాలు ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని కొందరు ఏసీఏ ప్రతినిధులు వద్ద ప్రస్తావించగా అటువంటిదేమీ ఉండదని తేలికగా తీసుకున్నారని సమాచారం.

సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ పద్మవ్యూహం

ఆంధ్రజ్యోతి విజిట్

- అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు
- నిబంధనల ఉల్లంఘనపై చర్యలు శూన్యం
- విధి నిర్వహణలో ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం
- సెల్‌ఫోన్లు చూస్తూ కాలయాపన
- చలాన్ల వసూళ్లపైనే ప్రధాన దృష్టి
- వాహనదారుల్లోనూ కొరవడుతున్న అవగాహన
- రెడ్ సిగ్నల్ పడినా వాహనాలు నిలపని పరిస్థితి
- అందని ద్రాక్షలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

తూర్పు నియోజకవర్గంలో పలు ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ నిర్వహణ అధ్వానంగా ఉంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా సిగ్నల్స్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడం, విధి నిర్వహణ కంటే సెల్ ఫోన్లు చూసేందుకే ఎక్కువ సమయం కేటాయించడం, కొన్ని చోట్ల రహదారులు బాగా లేకపోవడం.. తరచూ ఎదురయ్యే సాంకేతిక సమస్యలు.. వంటి కారణాల వల్ల ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ గాడి తప్పిందని, దీంతో తాము అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులకు కేసుల నమోదుపై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నిర్వహణపై లేకపోతోందన్న విమర్శలు ఉన్నాయి. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా ఎదుగుతున్న క్రమంలో ఇక్కడ అనేక అంతర్జాతీయ సదస్సులు, రాజకీయ సమావేశాలు, ప్రజాప్రతినిధులు, నేతల సందర్శనలు, ఉన్నతాధికులు సందర్శనలు, ముఖ్యమైన కార్యక్రమాలు తరచూ జరుగుతుండడం, వాహనాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. అయితే అందుకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో రోడ్డుపైకి వాహనంతో రావాలంటేనే ట్రాఫిక్ గుర్తొచ్చి భయమేస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయవచ్చు. పద్మవ్యూహంలా తయారైన ట్రాఫిక్ సమస్యకు అధునాతక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించే పరిష్కారం చూపుతామంటూ అధికారులు ఎప్పటి నుంచో చెబుతున్నారే తప్ప ఆచరణలోకి తేవడం లేదని నగర ప్రజలు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

హనుమంతువాక.. సహనానికి పరీక్ష

- రెడ్ సిగ్నల్ పడితే ఆగేదేలే..
- గ్రీన్ సిగ్నల్ పడితే తగ్గేదేలే..
- నిత్యం గజిబిజిగా ట్రాఫిక్


హనుమంతవాక జంక్షన్‌లో రెడ్ సిగ్నల్ పడినా వెళుతున్న వాహనదారులు

విశాలాక్షినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సిగ్నల్స్ వ్యవస్థ ఉన్నా హనుమంతవాక కూడలి వాహనాల రద్దీతో నిత్యం గజిబిజిగా ఉంటుంది. నగరం నుంచి మధురవాడ వైపునకు పోయే వాహనాలు ఓ వైపు, మధురవాడ నుంచి నగరం వైపునకు వచ్చే వాహనాలు మరో వైపు, అలాగే బీఆర్టీఎస్ రోడ్డు నుంచి నగరంలోకి వెళ్లే వాహనాలతో పాటు విశాలాక్షినగర్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు వైపునకు వెళ్లే వాహనాలతో హనుమంతవాక కూడలి అస్తవ్యస్తంగా ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా నిబంధనలు పాటించని వా హనచోదకులతో ప్రమాదాలకు కేరాఫ్‌గా హనుమంతవాక కూడలి మారింది. ఉదయం నుంచి రాత్రి వరకూ వాహనాల నిత్యం రాకపోకలతో హనుమంతవాక కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులు సవాలుగా మారింది.

హనుమంతవాక కూడలిలో విపరీతమైన ట్రాఫిక్‌తో వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పిల్లలను ద్విచక్ర వాహనాలపై స్కూళ్లకు తీసుకెళ్లడంతో పాటు, కార్యాలయాలకు వెళ్లే వారు, వివిధ పనులపై నగరానికి ఇతర ప్రాంతాల నుంచే వారిలో వాహనాలు ఈ సిగ్నల్ వద్ద కిక్కిరిసి పోతుంటాయి. రోజూ ఉండే ఆటోలు, స్కూళ్లు-కళాశాలల వాహనాలు వందల సంఖ్యలో ఉంటాయి. నగరంలో అత్యధిక ట్రాఫిక్ ఉంటే కూడలిగా హనుమంతువాకను పేర్కొంటారు. ఈ ట్రాఫిక్ సిగ్నల్‌ను దాటితే తమ ప్రయాణం సగం అయినట్టేనని వాహనదారులు భావిస్తుంటారు. అలాగే కనీసం ఈ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కనీసం రెండు సార్లు ఆగితే కానీ వెళ్లలేమని వాహనదారులు చెబుతుంటారు. ఇక్కడ ఆటోవాలాల సమస్య ప్రధానంగా ఉంటుంది. నగరం నుంచి వచ్చే వాహన శ్రేణి పెరిగిపోవడంతో విశాలాక్షినగర్ వైపు వాహనదారులు ఒన్‌వేలో జాతీయ రహదారి పైకి వచ్చేస్తున్నారు. అలానే సిగ్నల్ రెడ్ పడినా వాహనాదారులు ఆగకుండా వేగంగా వెళ్లి పోతున్నారు. మరోవైపు అంతలోనే గ్రీన్‌సిగ్నల్ పడేసరికి వేగంగా వచ్చేవాహనదారులతో గందరగోళానికిగురవుతున్నారు.


ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం..

సిగ్నల్స్ క్రాస్ చేసే వాహనాలను నియంత్రణలో పోలీసులు వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎక్కడో ఓ మూల కూర్చోని విధులు నిర్వహిస్తుంటారు. హనుమంతువాక కూడలి వంటి జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీ ఉన్నప్పుడు పోలీసులు అధికంగా ఉండాలి. ఒకరిద్దరితో వేల వాహనాలను కంట్రోల్ చేయడం క్లిష్టమైన పని. ట్రాఫిక్ నిబంధనలను అవగాహన పర్చడంలో విఫలం చెందుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి కళాశాల యువకులను వలంటీర్లుగా ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. వీఐపీలు వచ్చేటప్పుడు తప్ప రహదారులపై పోలీసులు ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఋూఅఅవాహనదారులు కూడా నిబంధనలు పాటించాలి. ఇంత బిజీగా ఉండే హనుమంతవాక జంక్షన్‌లో.. వాన పడినప్పుడు మరింత అధ్వానంగా ట్రాఫిక్ మారిపోతుంది. గంటల తరబడి, కిలోమీటర్లు కొద్దీ వాహనాలు నిలిచిపోతుంటాయి. అప్పుడు ట్రాఫిక్ పోలీసులకు పరిస్థితిని చక్కదిద్దడం తలకు మించిన పనైపోతుంది.

సెల్‌ఫోన్‌పైనే ధ్యాస.. విధులపై నిర్లక్ష్యం

- ఉదయం 8:40 గంట వరకు డ్యూటీలో చేరని సిబ్బంది
- హెల్మెట్ లేని వాహనదారులను పక్కకు పిలిచి 'మాటా-మంతీ'


విధి నిర్వహణలో ఉండగా సెల్‌ఫోన్‌లో నిమగ్నమైన ట్రాఫిక్ పోలీస్


ఇసుకతోట జంక్షన్‌లో ఇష్టారాజ్యంగా వెళుతున్న వాహనాలు

మద్దిలపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట, వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు 'ఆంధ్రజ్యోతి విజిట్'లో ట్రాఫిక్ సమస్యలెన్నో వెలుగుచూశాయి ఇసుకతోట సిగ్నల్ పాయింట్ వద్ద సమయానికి ట్రాఫిక్ పోలీసులు విధుల్లోకి హాజరు కాకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్నారు. ఇసుకతోట సిగ్నల్ వద్ద ఉదయం 7 గంటలకు హాజరు కావాల్సిన ట్రాఫిక్ సిబ్బంది 8.40 గంటలకు విధుల్లోకి వచ్చారు. అప్పటి వరకూ సిగ్నల్స్ పడుతున్నా, వాహనదారులు ఆపకుండా ఇష్టానుసారం వెళ్లడం ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆర్టీసీ బస్సులు మరీ దారుణంగా ఉన్నాయి. రెడ్‌లైట్ పడిన ఆపకుండా వేగంగా ప్రయాణిస్తున్నాయి. పొరపాటున ఆ సమయంలో గ్రీన్‌లైట్ వెలిగిన వైపు నుంచి వాహనాలు వస్తే.. పెద్ద ప్రమాదాలే సంభవిస్తాయి. అంతేకాకుండా ఇసుకతోట సిగ్నల్ వద్ద బైకర్లు రోడ్డు మధ్యలో బైక్‌లను నిలిపి సిగ్నల్ కోసం వేచి చూస్తున్నారు. ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద వన్ వేలో వాహనాలు ప్రయాణించడం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఎంవీపీ కాలనీ నుంచి మద్దిలపాలెం వచ్చే వాహనాలు పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా వన్‌వేలోవస్తున్నవాహనాలతోఆగిపోవాల్సి వస్తోంది.

సెల్‌ఫోన్లోనే హోంగార్డు...

వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డు ఫోన్లోనే ఉంటున్నారు. చెట్టు కింద కూర్చొని సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలయాపన చేస్తూ కనపించారు. అంతటితో ఆగకుండా రోడ్డు మధ్యలో నిల్చొని కూడా సెల్‌ఫోనే చూసుకోవడం గమనార్హం. సిగ్నల్‌లో హెల్మెట్ లేని బైకర్లకు హోంగార్డు ఫోటోలు తీసి చెట్టు కిందకు వెళ్లి వారితో మాట్లాడుకుంటున్నారు.

ఇక్కడ ఎంవీపీ కాలనీ లోపల నుంచి వచ్చే ద్విచక్ర వాహనదారులు ఇసుకతోట హైవేపై వచ్చే వాహనాలకు ఎదురుగా వెళ్తున్నారు. వెంకోజీపాలెం గ్రామానికి వెళ్లే వారు చుట్టూ తిరిగి రాకుండా సిగ్నల్ వద్ద వాహనాలకు ఎదురుగా వెళ్లడం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఆటోలు కూడా సిగ్నల్ వద్దే ప్రయాణికుల కోసం పార్కింగ్ చేయడం వాహనాలకు ఆటంకం కలుగుతోంది.

డేటింగ్ యాప్‌లను నిషేధించాలి

మద్దిలపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహిళలను అంగట్లో పెట్టే డేటింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధించాలని జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్ చేశారు. శివాజీపాలెంలోని ప్రెసిడెన్సీ డిగ్రీ కళాశాలలో మంగళవారం డేటింగ్ యాప్‌లను నిషేధించాలని చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి డేటింగ్ యాప్‌ల వల్ల మరిన్ని దారుణాలు పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్నేహం పేరుతో మహిళలను ఎరగా వేసి యాప్‌ల నిర్వాహకులు రూ.కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ప్రేమికుల రోజును వ్యతిరేకించే హిందు సంఘాలు డేటింగ్ యాప్‌లను ఎందుకు వ్యతిరేకించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డేటింగ్ యాప్‌లపై నిషేధం విధించాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు దుర్గాప్రసాద్, దేవర శంకర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం),
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలనీ** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ),
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల్ ఫ్రండ్** : శ్రీకన్య కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 45, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 52, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 48, బీరకాయలు 44, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబాటి 46, ముల్లంగి 30ఖఖరి, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 56, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద 50, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 54, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 180, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

డబుల్ రోడ్డులో చెట్ల నరికివేత

- అధికారుల తీరుపై స్థానికుల విస్మయం


రోడ్డు పొడవునా ఉన్న పొడవాటి అశోక చెట్లు నరికివేతతో బోసిపోయిన రహదారి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చెప్పింది అర్థం కాలేదా.. లేక అధికారులే అలా చెప్పారో తెలియదు గాని జీవీఎంసీ సిబ్బంది ఓ ఘన కార్యం చేశారు. ఎంవీపీ డబుల్ రోడ్డులో అందమైన, పొడవైన అశోకచెట్లు రోడ్డు మధ్యలో ఉన్నాయి. వాస్తవానికి ఈ చెట్లే ఈ రహదారికి అందం. డివైడరుపై ఈ చెట్లతో పాటు విద్యుత్తు దీపాలు కూడా ఉన్నాయి. ఈ దీపాలకు స్తంభానికి అటూ ఇటూ ఉన్న చెట్ల కొమ్మల వల్ల కొంతమేర లైటింగ్ అడ్డుకుని, రహదారిపై చీకటిగా ఉండే అవకాశం ఉంది. ఈ చెట్లు విద్యుత్తు స్తంభం కంటే పొడవుగా ఉంటాయి. ఎక్కడైనా విద్యుత్తు దీపానికి కింది భాగంలో వీటి కొమ్మలు ఉంటే వెలుతురు కోసం అక్కడ కొమ్మలను కట్ చేయొచ్చు. కానీ జీవీఎంసీ సిబ్బంది ఏకంగా చెట్లనే నరికేశారు. కేవలం మోడు మాత్రమే మిగిలేలా యంత్రాలతో కోసేశారు. స్మార్ట్ సిటీ, గ్రీన్ సిటీ అని గొప్పగా చెప్పుకుని, ఇలా చెట్లను నరికేస్తే ఇంకేం అందాలు మిగులుతాయని ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు దీపం కంటే కింది భాగంలో ఉన్న కొమ్మలు కట్‌చేయాలి గాని, మొత్తం నరికేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఈ దీపాలకు విద్యుత్తు తీగలు కూడా అండర్ గ్రౌండ్‌లో ఉంటాయి. కాబట్టి చెట్టు కొమ్మలు తగిలి విద్యుదాఘాతం అయ్యే ప్రమాదం కూడా లేదు. మరి అధికారులు ఎందుకిలా చేశారా? అని ప్రశ్నిస్తున్నారు.

భూగర్భ డ్రైనేజీ లీకులతో దుర్గంధం

- పరిష్కారానికి కార్పొరేటర్ మంగవేణి హామీ

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులో భూగర్భ డ్రైనేజీ సమస్యలు తరచుగా వస్తున్నాయి. ఎప్పటికప్పుడు మురుగు నీరు పైకి వస్తుండడంతో తీవ్ర దుర్గంధం వ్యాపించి ఈ ప్రాంతీయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సమస్యను స్థానికులు.. కార్పొరేటర్ గొలగాని మంగవేణి పోలరావు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఇక్కడ మరమ్మతులు చేపట్టినా తరచూ ఇదే సమస్య ఎదురవుతోందని, శాశ్వత పరిష్కారం చూపించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. పదిహేను రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటరు హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పెదవాల్తేర్ : సీసీ రోడ్డు పనులకు శంకుస్థాన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 21వ వార్డు సీబీఐ డౌన్ విద్యానగర్ కాలనీలో రూ. 36.35 లక్షల జీవీఎంసీ నిధులతో పలు అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజిలకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జోన్-3 కమిషనర్ శివప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణబాబు మాట్లాడుతూ అభివృద్ధి పనులు సకాలం లో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చినవాల్తేరు, కాపువీధి, విద్యానగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వంతెనల నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతన్నరెడ్డి, పీతల అమరేంద్ర, పీతల అవినాష్, మూర్తి యాదవ్, వినయ్ మంగరాజు, ఇతర నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ కేబుల్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలో 33 కేవీ అండర్ గ్రౌండ్ కేబుల్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం ప్రారంభించారు. మరింత నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తు సరఫరాకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీర్ జి.శ్యాం బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు, డీఈఈలు సుమన్, శ్రీనివాస్, ఏఈఈ సురేష్, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్‌ఎంయూఏకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో స్థానం


శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వాల్తేర్ డిపో ఉద్యోగులు

పెదవాల్తేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ఆంధ్రప్రదేశ్‌సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సభ్యత్వం ఇచ్చిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావును వాల్తేరు డిపో ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద అసోసియేషన్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందడమే కాకుండా ఈరోజు జాయింట్ కౌన్సిల్‌లో అవకాశం కల్పిస్తూ జీవో నెం.129 ఇప్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీవో వల్ల ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు పొందడమే కాకుండా అన్ని సమస్యలు పరిష్కరించుకోవడానికి, ఉద్యోగులు చక్కగా ఉద్యోగాలు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. స్త్రీ శక్తి పథకం తర్వాత ఏర్పడిన సమస్యలు పరిష్కరించడం కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, రాష్ట్ర కార్యదర్శి పీజీ పతి, జిల్లా కార్యదర్శి ఏకే శివాజీ, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎం నాయుడు, ఆర్.వసంతరావు, ఇతర ముఖ్య నాయకులు, ఆధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పోషకాహారంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి



విద్యార్థులకు ప్రొటీన్ చక్కీలను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, జ్ఞానమిత్రదాస్, తదితరులు

పెదవాల్తేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి పోషకాహారం తీసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మంచి విద్యావంతులుగా రూపొందుతారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. మంగళవారం ఈస్టు పాయింట్ కాలనీలో గల కేడీపీఎం హైస్కూలో అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామకృష్ణబాబు, అక్షయ పాత్ర ఫౌండేషన్ జ్ఞానమిత్ర దాస్‌తో కలిసి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరు ధాన్యాలతో తయారు చేసిన చక్కీ, వేయించిన వేరుశెనగలతో తయారు చేసిన ప్రోటీన్ బార్‌ను విద్యార్థులకు అక్షయ పాత్ర ఫౌండేషన్ వారానికి మూడు రోజులు, మంగళ, గురు, శనివారం అందజేస్తున్నట్టు తెలిపారు.అనకాపల్లి నుంచి భీమిలి వరకు గల ప్రభుత్వ పాఠశాలలో 2008 నుంచి మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ ఆస్పత్రులు, అన్న క్యాంటీన్లు నిత్యం అన్నదానం చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయుకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, కంబావు శివారెడ్డి, మురళీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతీ బాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ హరేంధిరప్రసాద్


ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోధిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ఎండాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వినూత్న బోధనా పద్ధతులను అనుసరించి, విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మమేకమై పలు అంశాలపై ముచ్చటించారు. కుశల ప్రశ్నలు వేసి, వారి సామర్థ్యాలను అంచనా వేశారు. వివిధ పాఠ్యాంశాల్లోని అంశాలపై ప్రశ్నలు అడిగారు. పాఠ్యపుస్తకాల్లోని చిత్రాలను చూపించి వాటి వివరాలను చిన్నారులతో రాబట్టారు. ఆసక్తి రేకిత్తించే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని, విద్యార్థుల్లో తార్కిక భావజాలం పెంపొందేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలు అడిగే ప్రశ్నలకు స్నేహ పూర్వక వాతావరణంలో సమాధానం ఇవ్వాలని, అప్పుడే వారిలో బిడియం పోతుందన్నారు. అనంతరం పాఠశాలలోని వసతులను, మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్ తదితరులున్నారు.

రేపటి నుంచి ఆర్గానిక్ మేళా



వివరాలు వెల్లడించి, బ్రోచర్ ప్రదర్శిస్తున్న మేళా నిర్వాహకులు

మద్దిలపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 4 నుంచి నిర్వహించే ఆర్గానిక్ మేళాను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం మీడియాతో మాట్లాడారు. మేళాను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభిస్తారన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, వారాహి ఫెడరేషన్, హలో వైజాగ్, టెర్రస్‌గార్డెన్ గ్రూప్‌లు, గ్రీన్ క్లైమేట్, అగ్రి డీఎస్‌ఏ వెంచర్స్ సంయుక్తంగా మేళా నిర్వహిస్తున్నాయన్నారు. మేళాలో రసాయనాలు లేని ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, కార్యదర్శి అశోక్, ప్రకృతి రైతులు రిషి, నరేంద్ర, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సముద్ర జీవ వనరులపై అవగాహన

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు, సముద్ర జీవ వనరుల విభాగం స్వర్ణోత్సవాల సందర్భంగా మంగళవారం మెరైన్ లింగ్ రిసోర్స్ డిపార్టమెంట్‌లో సముద్ర జీవ వనరులపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ సముద్ర జీవ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ రాయప్రోలు, సీనియర్ జనరల్ మేనేజర్ ప్రొఫెసర్ కొండముది రమేష్‌బాబు తదితరుల మాట్లాడుతూ రిసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, అవంతి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ ప్రాణాంతకం కాదు

జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు వివరణ


డాక్టర్ పి.జగదీశ్వరరావు

సీతమ్మధార, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వినిపిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదని, దీనిపై ప్రజలు భయాందోళన చెందనవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఈ జీవి కుట్టినప్పుడు కనిపించే లక్షణాలు జ్వరం, తలపోటు, కండరాల నొప్పులు, ఆకలి లేకపోవడం, శోషరస కణువుల వాపు, వినికిడి తగ్గుదల, దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటివి ఉంటాయన్నారు. దీనికి చికిత్సగా డాక్సిసైక్లిన్, ఎజిత్రోమైసిన్ వంటి మందులు వాడటం ద్వారా నివారించవచ్చన్నారు. ఇంట్లో ఎలుకలు లేకుండా చూసుకోవడం ముఖ్యమన్నారు. ఈ వ్యాధి జిల్లాలో 2023లో 12 పాజిటివ్ కేసులు, 2024లో 11 కేసులు, 2025లో 11 పాజిటివ్ కేసులు నమోదైనా, ఒక్క మరణం కూడా సంభవించలేదన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుని సంప్రదించి తగిన చికిత్స పొందాలని డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు.

ఐటీఐ ప్రిన్సిపాల్‌గా సోలోమోన్ బాధ్యతల స్వీకరణ



కంచరపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా ఎన్.సోలోమోన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సోలోమోన్ విజయవాడలోని ఉపాధి, శిక్షణ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్నారు. ఈయనను ప్రభుత్వం ఐటీఐకు ప్రిన్సిపాల్‌గా నియమించడంతో మంగళవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సోలోమోన్‌ను వైస్ ప్రిన్సిపాల్ డి.వేంకటేశ్వరరావు, ఇతర ఉద్యోగులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. సోలోమోన్ వివిధ ట్రేడులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో తరుణ్‌కు పతకం


తరుణ్‌ను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల యాజమాన్య ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడలు వెయిట్ లిఫ్టింగ్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించిన బుల్లయ్య కళాశాల విద్యార్థి ఎం.తరుణ్ రజత పతకం సాధించాడు. రాజస్థాన్‌లో జరిగిన ఈ టోర్నీలో 88 కిలోల విభాగంలో పోటీపడిన తరుణ్ రజత పతకం సొంతం చేసుకున్నాడు. మంగళవారం బుల్లయ్య కళాశాల యాజమాన్య ప్రతినిధులు తరుణ్‌ను అభినందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ విద్య సాకారం


సమావేశంలో పాల్గొన్న చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారామ్

అక్కయ్యపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే పిల్లల్లో సంపూర్ణ విద్య సాకారమవుతుందని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారామ్ అన్నారు. ఎన్‌జీజీఓస్ కాలనీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ బార్ ప్యాకెట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఉదయం వీటిని అందిస్తారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ పౌష్టికాహారంతో రక్తహీనతతో పాటు ఇతర వ్యాధులకుచెక్ చెప్పవచ్చన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాధాకుమారి, అక్షయ పాత్ర ప్రతినిధి రాజేశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జోగారావునగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం


ఓ వీధిలో వేస్తున్న సిమెంటు రోడ్డు

కంచరపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి జోగారావు నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం అధికారులు చేపట్టారు. గతంలో ఇక్కడ రోడ్డుకు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు రోడ్డు నిర్మాణానికి అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ రూ.3.96 లక్షలు మంజూరు చేయడంతో పనులను అధికారులు మంగళవారం ప్రారంభించారు.


సిగ్నల్ పాయింట్ వద్ద వాహనాల మధ్యలోనే రోడ్డు దాటుతున్న పాదచారులు


రెడ్ సిగ్నల్ పడిన తర్వాత కూడా గురుద్వార కూడలి నుంచి సత్యం జంక్షన్ వైపు వాహనాలు


గురుద్వార సిగ్నల్ పాయింట్ వద్ద రాంగ్‌రూట్‌లో సిగ్నల్ పక్కకు వచ్చిన వాహనదారులు

రాంగ్‌రూట్‌లో రైట్..రైట్!

- నిబంధనలు చెవికెక్కించుకోరు పోలీసులు పట్టించుకోరు!
- సీతమ్మధార, గురుద్వార ప్రాంతాల్లో ఎవరి దారి వారిదే..
- చలాన్ల వసూలుకే పరిమితమైన ట్రాఫిక్ పోలీసు యంత్రాంగం

ఆంధ్రజ్యోతి విజిట్

సీతంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవరి దారి వారిదే.. అన్నట్లు సాగుతోంది పలు ప్రాంతాల్లో రాకపోకల పరిస్థితి. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్న ఆలోచనకన్నా, 'దాటేద్దామనే' వైఖరి ఎక్కువమందిలో కనిపిస్తోంది.ప్రభుత్వ అజమాయిషీలో పనిచేసే ఆర్టీసీ డ్రైవర్లు సైతం ఇందులో ఉండడం విశేషం. రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా తమకు నచ్చిన విధంగా వాహనాలతో రయ్..రయ్ మంటూ దూసుకుపోతున్నారు. చలాన్ల బకాయిలు వసూలు చేయడమే తమ పని అన్నట్లుగా ట్రాఫిక్ సిబ్బంది పనిచేస్తుంటే, కూడళ్లలో కొందరు పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. ముఖ్యంగా గురుద్వార సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న కానిస్టేబుల్ స్టాండ్‌లో సిబ్బంది లేరు. ద్విచక్ర వాహనదారులు సిగ్నల్ పాటించకుండా వెళ్లిపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి వచ్చే బస్సులు మద్దిలపాలెం వైపు వెళ్లేవి రెడ్ సిగ్నల్ పడినా జంప్ చేసి వెళ్తున్నారు. ఆటోవాలాలు టికెట్ సర్వీస్ కోసం సిగ్నల్ పాయింట్ వద్దే ప్రయాణికులను ఎక్కించుకుంటూ వెనుక వస్తున్న వాహనాలను పట్టించుకోవడం లేదు. అక్కయ్యపాలెం పాయింట్ నుంచి సత్యం కూడలి వైపు వెళ్లేవారు గురుద్వార వద్ద రెడ్ సిగ్నల్ పడినా ఆగడం లేదు. సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న జీబ్రా లైన్లను కూడా లెక్కచేయడం లేదు. అదే విధంగా సిగ్నల్ వైపు కాకుండా స్టాండ్ పక్కకు వచ్చి ద్విచక్ర వాహనదారులు, ఆటోలు నిలిపివేసి సిగ్నల్ పడక ముందే వెళ్తున్నారు. ద్విచక్రవాహనదారులు అతి వేగంగా రావడంతోపాటు సిగ్నల్స్‌ని అసలు పట్టించుకోవడం లేదు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ట్రాఫిక్ పాయింట్‌లో గల స్టాండ్‌లో ట్రాఫిక్ పోలీసులు కనిపించలేదు. వాహనాలు యథేచ్ఛగా వెళ్లినా, ట్రాఫిక్ నియంత్రణ చేయకపోవడం గమనార్హం. గురుద్వార సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీసు స్టేషన్ అవుట్ పోస్టు వద్ద ఒక ట్రాఫిక్ పోలీసు మాత్రం బయట నిలబడి, విజిల్ వేస్తూ, అవుట్ పోస్టులోకి వెళ్లిపోతుంటారు. ఉదయం 8-9.30 గంటల మధ్య ట్రాఫిక్ రద్దీగా ఉంది. ఆ తరువాత ట్రాఫిక్ రద్దీ కాస్త తగ్గి వాహనాల రాకపోకలు సిగ్నల్ ఆధారంగా సహజంగా సాగాయి. యువకులు కొంత మంది ట్రిబుల్ రైడింగ్‌తో వేగంగా వెళ్తున్నారు. గురుద్వార నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సిగ్నల్ పడిపోయినా అతివేగంగా మలుపులో కట్ చేసి సిగ్నల్ జంప్ చేస్తున్నారు.


ట్రాఫిక్ కానిస్టేబుల్ లేకపోవడంతో రెడ్ సిగ్నల్ పడినా రోడ్డు దాటుతున్న పాదచారులు

నిర్లక్ష్యానికి నిలువుటద్దం!



ఈ చిత్రం చూశారా? పరిశుభ్ర నగరంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని జీవీఎంసీ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా, బాధ్యత తమది కాదన్నట్లు స్థానికులు చెత్తను విసిరిపారేస్తున్నారు. గ్రేటర్ 25వ వార్డు సీతంపేట మధురానగర్‌లో దుర్గాగణపతి ఆలయం ఎదుట జీవీఎంసీ చెత్తడబ్బా ఉంచినా, వ్యర్థాలను అందులో వేయకుండా రోడ్డుపై పడేశారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్తున్న పాదచారులు, వాహన చోదకులు స్థానికుల తీరుకు ముక్కున వేలేసుకుంటున్నారు. పారిశుధ్య సిబ్బంది అయినా వెంటనే చెత్తను తరలించాల్సి ఉన్నా, వారూ చోద్యం చూస్తూ వాటిని అలాగే వదిలేశారు.

-సీతంపేట/ఆంధ్రజ్యోతి

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

డాబాగార్డెన్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు విద్యార్థినులు తమకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల సూచించారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో మాట్లాడుతూ మేళాలలో వివిధ కంపెనీలు పాల్గొన్నాయని, 59 మంది పాల్గొనగా, 18 మంది విద్యార్థినులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ విద్యాకల్పన, నివేదిత, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో కంప్యూటర్ లిటరసీ డే


బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులతో అధ్యాపకులు

జ్ఞానాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో మంగళవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీడే నిర్వహించారు. డిజిటల్ యుగంలో కంప్యూటర్ లిటరసీ పాత్రపై నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల విద్యార్థినులు పాల్గొన్నారు. క్విజ్ ఐటి, మ్యాప్ మిస్ట్, లెటర్ ఛేజ్, న్యూరో మ్యాచ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.సిస్టర్ హేమ, డా.పీకే జయలక్ష్మి, డా.ఎస్.జ్యోతి, కె.నాగశిరీష, జి.దీప్తి, ఎస్.మాధురి పాల్గొన్నారు.

'పదునెక్కిన పాట కవిత్వం ఒక సంచలనం'


సమావేశంలో మాట్లాడుతున్న రచయిత డాక్టర్ మాటూరి శ్రీనివాస్

సీతంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచన సాహిత్య చరిత్రలో పదునెక్కిన పాట కవిత్వం ఒక సంచలనమని, ఒక రికార్డు అని రచయిత, ప్రధాన వక్త డాక్టర్ మాటూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. పదునెక్కిన పాట కవిత్వంలో ఉన్న కవిత్వం సమాజంలో పాతుకుపోయిన అన్ని అసమానతలనూ బట్టబయలు చేసిందన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సమతా సాహితి ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ బండి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన నిర్వహించిన సాహిత్య సమావేశంలో కవితా సంకలనంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయవాడ నుంచి వచ్చిన గుంటూరు లక్ష్మీనర్సయ్య దళిత బహుజన సాహిత్యం పూర్వాపరాలను తెలియజేస్తూ దళిత సాహిత్యం ఏ స్థాయిలో వచ్చిందో, దానికి తాత్విక దృక్పథంపై కూడా అంత సాహిత్యం వచ్చిందన్నారు. ఏయూ ఆచార్యులు డాక్టర్ ఎం.ప్రతాప్, మహిళా చేతన అధ్యక్షురాలు కత్తి పద్మ, ఉప్పల అప్పలరాజు, చిన సూర్యనారాయణ, డాక్టర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమికి విస్తృత ఏర్పాట్లు

మహారాణిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమి సందర్భంగా గురువారం ఇసుకకొండ శ్రీరమా సత్యనారాయణస్వామి ఆలయంలో జరిగే వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. పౌర్ణమి దేవాలయంగా పిలిచే ఆలయంలో గురువారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి పూజాది కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. నాలుగు గంటలకు ధ్వజస్తంభం పూజలు, 4.30 నుంచి రాత్రి 10 గంటల వరకు భక్తులకు దర్శనాలు కల్పిస్తామన్నారు. ఉదయం 7, 8.30, 10.30 గంటలకు సామూహిక సత్యనారాయస్వామి వ్రతాలను నిర్వహిస్తామన్నారు. కేజీహెచ్ నుంచి ఆలయానికి వచ్చే మార్గాన్ని మూసివేశామని, వాహనదారులు పూర్ణామార్కెట్ వద్ద ఘాట్‌రోడ్డు మీదుగా చేరుకోవాలన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీకి ఏయూ జట్టు


ఏయూ ఫుట్‌బాల్ జట్టుతో ప్రొఫెసర్ విజయ్‌మోహన్

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఏయూ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకుడు, స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక సౌత్‌జోన్ టోర్నీలో ప్రతిభను కనబరిచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పతకం అందించడంతోపాటు అఖిల భారత అంతర్ వర్సిటీల చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనేందుకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఫుట్‌బాల్ జట్టు సభ్యులు: బి.వరుణ్, సిహెచ్.పావన్ బాబు, ఆర్.కృష్ణ, ఎకె.రామ్, ప్రణీత్, బిఎం.కుమార్, ఎస్.కార్తీక్‌రెడ్డి, యుబి.రాజేష్, టి.రాజశేఖర్, ఎ.విజయ్‌కుమార్, వి.హర్షవర్ధన్, నవీన్, బి.రామకృష్ణ, ఎండి.అమాన్, ఎం.రేవంత్, ఆర్.ప్రభాకర్ ఎంపికయ్యారు.

నిబంధనలకు విరుద్ధంగా తృప్తి క్యాంటీన్

- సీతంరాజుకు బీచ్ వర్తకుల సంఘం ఫిర్యాదు


సీతంరాజుకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

మహారాణిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్కే బీచ్‌లో తృప్తి క్యాంటీన్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి, విక్రయాలు సాగిస్తున్నారని, దానిని వెంటనే నిలుపుదల చేయాలని బీచ్ వర్తకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ప్రభుత్వం ప్రజలకు టీ, కాఫీ, అల్పాహారం తాగునీటిని తక్కువ ధరకు అమ్మేందుకు అనుమతి ఇచ్చిందని, కానీ తృప్తి క్యాంటీన్‌లో నాలుగు డ్వాక్రా సంఘాలను ముందు పెట్టి సంబంధం లేని వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, జీవీఎంసీకి ఎలాంటి రుసుం చెల్లించడం లేదన్నారు. వెంటనే క్యాంటీన్‌ను నిలిపివేసి, చిల్లర వ్యాపారులకు నష్టం లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీహెచ్ రమణ, తిరుమలరావు, తెడ్డు శంకర్, సత్యప్రసాద్ తదితరులున్నారు.

ఎన్నికల హామీని విస్మరించిన ప్రభుత్వం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

అల్లిపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించడంతో పాటు ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా సమితి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగ భృతి, మహిళకు నెలకు రూ.1,500 తదితర హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం వైద్య కళాశాలల్లో 47 శాతం సీట్లను అమ్మేందుకు వీలుగా జారీ చేసిన 107, 108 జీవోలను రద్దుచేస్తామని హామీ ఇచ్చారని, వాటిని రద్దు చేయకుండా వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగించి, నూరు శాతం సీట్లను విక్రయించుకునే అవకాశం కల్పించారని విమర్శించారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నట్టు ప్రకటించారని, గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా నిర్వహించిన సదస్సులో ప్రకటించిన పెట్టుబడులు ఏమేరకు వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో చెక్కెర కర్మాగారాలు, స్పిన్నింగ్ మిల్లులు, ఫెర్రో పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. విశాఖ జిల్లాలో భూములను కార్పొరేట్ కంపెనీలకు పంచి పెడుతున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే సీపీఐ శతజయంతి ఉత్సవాల సభకు కార్యకర్తలు తరలిరావాలన్నారు. మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతు సమస్యలపై ఈనెల 10న, వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై 18న ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ జాతీయ సమితి సభ్యుడు జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం.పైడిరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'సెయిల్' రిటైర్డ్ ఉద్యోగికి మూడేళ్ల జైలు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో 'సెయిల్' రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాగం కిశోర్‌కు మూడేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. రాగం కిశోర్ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్)లో పనిచేస్తున్నప్పుడు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని సీబీఐ సోదాలు నిర్వహించింది. 1988 జనవరి నుంచి 2000 ఏప్రిల్ 19 వరకు ఆస్తులు పరిశీలించగా స్థిరచరాస్తులన్నీ కలిపి రూ.60,25,825 ఉన్నట్టు గుర్తించారు. వాటిని ఎలా సంపాదించారనే దానిపై ఆయన సీబీఐకి సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయారు. దానిపై సీబీఐ కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. సుదీర్ఘంగా సాగిన ఈ కేసులో విశాఖపట్నం సీబీఐ కోర్టు మూడేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చింది.


ఆర్అండ్‌బీ కార్యాలయం ఆవరణలో కొత్తగా పెట్టిన బడ్డీ

ఇష్టానుసారం దుకాణాల ఏర్పాటు

- ఆర్అండ్‌బీ కార్యాలయం ఆవరణలో దుస్థితి
- పట్టించుకోని అధికారులు

మురళీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 51వ వార్డు మాధవధార జాతీయ రహదారిలో ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయం నిర్వహణ తీరు విమర్శలకు తావిస్తోంది. కార్యాలయం ఆవరణలో, ప్రహరీ లోపలి భాగంలో అనధికార బడ్డీలు, ఐరన్ కంటైనర్ దుకాణాలు వరుసగా ఏర్పాటు చేస్తున్నా..కార్యాలయం అధికారులు స్పందించడం లేదు. వాహనదారులకు ఇబ్బంది లేకుండా నగర వ్యాప్తంగా ఒకవైపు దుకాణాలు తొలగిస్తుండగా, ఇక్కడ మాత్రం కార్యాలయ హైవే రోడ్డును ఆనుకొని జరుగుతున్న ఆక్రమణలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. రెండేళ్ల క్రితం జీ 20 సదస్సు సమయంలో కార్యాలయ ఆవరణలోనూ, ప్రహరీలో నుంచి దారి కల్పించి నెలకొల్పిన బడ్డీలను పూర్తిగా తొలగించారు. వారిలో ఎవరు వాస్తవంగా జీవనోపాధి పొందుతున్నారో గుర్తించి రోడ్ ఫ్రీ లెఫ్ట్ మార్గంగా ఉన్న ఉడా కాలనీ దారి వాటర్ పంప్‌హౌస్ వద్దకు షిఫ్ట్ చేశారు. అయితే మళ్లీ ఇప్పుడు ఒక్కొక్కటిగా కార్యాలయాన్ని ఆనుకుని దుకాణాలు వెలుస్తున్నాయి. పెద్ద పెద్ద బడ్డీల్ని నేరుగా క్రేన్లతో తీసుకొచ్చి వారికి నచ్చిన విధంగా కార్యాలయ ప్రహరీని ఆనుకొని సర్దుబాటు చేస్తున్నారు. నగరం వ్యాప్తంగా ఒకవైపు పచ్చని మొక్కలతో సుందరీకరణ, హైవే సర్వీసు రోడ్డుకి ఇరువైపులా వేసిన ఐరన్ ఫెన్సింగ్‌కు రంగులద్ది డివైడర్లతో పెయింటింగ్ అలంకరణలు చేపడుతుంటే, ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద మాత్రం పరిస్థితిని మార్చలేకపోతున్నారు. కార్యాలయం వర్గాలు నగర సుందరీకరణకు గాని, సిటీ లుక్‌కు గాని సంబంధమే లేకుండా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కార్యాలయం ఎదుట వేసిన ఫుట్‌పాత్‌పై పానీయాలు అమ్మే దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటరు దర్శనమిస్తుంటాయి. ఐరన్ ఫెన్సింగ్ తొలగించి మరీ దుకాణాలు వెలుస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదు. కొత్తగా నిర్మిస్తున్న జీవీఎంసీ శాశ్వత జోనల్ కార్యాలయం సహా తాత్కాలిక కార్యాలయాలు ఆర్అండ్‌బీ కార్యాలయం పక్కనే ఉన్నాయి.అయినా జీవీఎంసీ అధికారులు గాని, ఆర్అండ్‌బీ అధికారులు గాని స్పందించడం లేదు.


కార్యాలయం లోపల వేసిన చెరుకు లోడ్ బండి

అప్పన్న సన్నిధిలో తిరునక్షత్ర పూజలు

సింహాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ సారథ్యంలో అధ్యాపకులు వైదిక సంప్రదాయంలో నాలాయిర దివ్య ప్రబంధంలోని సుమారు వెయ్యి పాశురాలను అనుసంధానం కావించారు. మధ్యాహ్నం రాజభోగం వేళ ప్రత్యేక నివేదనలు జరిపి తీర్థగోష్ఠి నిర్వహించి తొలుత వేకువన సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.

క్రికెట్ సందడి

... 3వ పేజీ తరువాయి

విధానం అమలు చేయడం లేదని తెలుస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ మాదిరిగా ముందు వచ్చినవారు తమకు ఇష్టమైన సీట్లలో కూర్చోవచ్చు. అయితే ఈ విధానంతో సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముందుగా వచ్చి ముందు సీటులో కూర్చొన్న వ్యక్తి వాష్‌రూమ్ లేదా వేరే అవసరాలతో అక్కడ నుంచి వెళితే..మరొకరు కూర్చొనే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదాలు ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని కొందరు ఏసీఏ ప్రతినిధులు వద్ద ప్రస్తావించగా అటువంటిదేమీ ఉండదని తేలికగా తీసుకున్నారని సమాచారం.

'సీ ప్లేన్' రెక్కలు తొడిగేనా?

... 3వ పేజీ తరువాయి

సిద్ధం చేసింది. డీపీఆర్ కూడా రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం ఉడాన్ పథకం ప్రవేశ పెట్టడంతో అందులో దీనిని చేర్చాలని పౌర విమానయాన శాఖకు లేఖ రాసింది. సీ ప్లేన్‌కు అవసరమైన జెట్టీ నిర్మిస్తామని ప్రతిపాదించింది. అయితే రూ.100 కోట్లతో చేపట్టిన క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణంలో నిమగ్నమైన పోర్టు అధికారులు, దీనిపై దృష్టి పెట్టలేకపోయారు. ఇప్పుడు క్రూయిజ్ టెర్మినల్ ఖాళీగానే ఉంది. అక్కడి నుంచి సీప్లేన్ నడుపుకునే అవకాశం ఉంది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ, శ్రీశైలం, హుస్సేన్ సాగర్ (హైదరాబాద్), చిలకా సరస్సు (ఒడిశా) తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి డిమాండ్ ఉంది. సీ ప్లేన్ నీటిపైన, భూమిపైన ల్యాండ్ అవుతుంది. అలాగే ఎక్కడి నుంచైనా టేకాఫ్ తీసుకోగలుగుతుంది. లోకల్ టూరిజం కింద విశాఖపట్నం నుంచి రుషికొండ, భీమిలి, అరకు, లంబసింగి నడపొచ్చు. అధికారులు ఈ దిశగా కృషి చేస్తే విశాఖకు మరో కొత్త పర్యాటక ఆకర్షణ జత కలుస్తుంది.

గజిబిజి.. గందరగోళం...

... 3వ పేజీ తరువాయి

జంపింగ్‌కు పాల్పడుతున్నారు. మరికొందరు వన్‌వేలో, రాంగ్‌రూట్‌లో వాహనాన్ని నడుపుతున్నారు. ఇలాంటి వాటన్నింటికీ అడ్డుకట్ట వేసి ట్రాఫిక్ నిబంధనలను పక్కగా పాటించేలా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసుల్లో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనాల రాకపోకలను పట్టించుకోకుండా ఇతర పనుల్లో నిమగ్నమై ఉంటున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

నగరంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్‌జామ్‌లు ఏర్పడకుండా చర్యలు తీసుకోవడం, నిబంధనలు ఉల్లంఘించే వారికి ఈ-చలాన్‌లను జారీచేయడం వంటి విధులను ట్రాఫిక్ సిబ్బంది నిర్వర్తించాల్సి ఉంటుంది. దీనికోసం మద్దిలపాలెం, హనుమంతవాక, పీఎం పాలెం జంక్షన్, కార్‌షెడ్‌జంక్షన్, కొమ్మాది వంటి కూడళ్లలో కనీసం ఇద్దరు సిబ్బంది అవసరం. కానీ ఆయా కూడళ్ల వద్ద ఒక్కరినే కేటాయిస్తున్నారు. ట్రాఫిక్ రోడ్ సేఫ్టీ పేరుతో నాలుగైదు పోలీస్ స్టేషన్ల పరిధిలో జాతీయ రహదారిపై పెట్రోలింగ్ కోసం కేటాయించే వాహనానికి డ్రైవర్ కాకుండా ఇద్దరు సిబ్బంది ఉంటున్నారు. ఆ వాహనంలో సిబ్బంది ఒక్కో కూడలి వద్ద ఆగి అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వర్తించే కానిస్టేబుల్/హోంగార్డుతో ముచ్చట్లు పెట్టుకుని కొంతసేపటి తర్వాత వెళ్లిపోతున్నారు. అలాకాకుండా ప్రధాన కూడలి వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లు/హోంగార్డులను నియమిస్తే సిగ్నల్ జంపింగ్‌లకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుంది.

బొర్రమాంబకు పూజలు

అగనంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత బొర్రమాంబకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ

అగనంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి సత్రం జంక్షన్‌లో బొర్రమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో అనాథలు, యాచకులు, వృద్ధులకు ఆహార పొట్లాలను మంగళవారం పంపిణీ చేశారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతల సాయంతో ప్రతివారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సేవ సమితి ఆర్గనైజన్ చిత్రా రామారావు తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలిన

అగనంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి ఈ- మర్రిపాలెం కూడలి నుంచి ఫార్మాసిటీ పునరావాస కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులను టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

భగవద్గీత పారాయణం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా మందిరంలో గీతా జయంతి (మార్గశిర శుద్ధ ఏకాదశి)ని పురస్కరించుకుని మంగళవారం భగవద్గీత పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరంలో ముందుగా విష్ణు సహస్రనామ స్తోత్రం, పారాయణం చేపట్టి అనంతరం భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలు పారాయణం చేశారు. అనంతరం సేవా సమితి సభ్యులు, సేవా దళం భక్తులు పాల్గొని గీతా ఉపదేశాలను ఆలపించారు. కార్యక్రమంలో మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ వత్రం

మల్కాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న జింక్ ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ వత్రం వైభవంగా నిర్వహించారు. పూజ ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

భూలోకమాంబ మారువారం

వేపగుంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు బీసీ కాలనీలో కొలువైన భూలోకమాంబ అమ్మవారి మారువారం పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సినిమా గైడ్

- **ఆంధ్రా కింగ్ తాలూకా** : శరత్, మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య (గాజువాక), ఎస్.వి.సి. లిఖిత (శ్రీహరిపురం).
- **ప్రేమంటే** : సంగమ్, కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీవెంకటేశ్వర-1, ఎస్.వి.సి. గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి).
- **12ఎ రైల్వే కాలని** : లీలామహల్, రామ, నటరాజ్ (పెందుర్తి). మిని మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతా రామయ్య (పరవాడ).
- **కాంత** :
- **రాజు వెడ్స్ రాంబాయి / మఫ్టీపోలీసు** : జగదాంబ
- **శిసు / రాజు వెడ్స్ రాంబాయి** : శారదా
- **పాంచ్‌మినార్ / ఇట్లు మీ ఎదవ** : రమాదేవి
- **ది గర్ల ఫ్రండ్** :శ్రీకన్య, కిన్నెర (మద్దిలపాలెం), నటరాజ్-2 (పెందుర్తి).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 40, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 60, గుత్తి/రవి వంకాయలు 54, బెండకాయలు58, పచ్చిమిర్చి 40, బజ్జీ పకోడిమిర్చి 52, కాకరకాయలు 46, బీరకాయలు 44, ఆనపకాయ 24,కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 56, దొండకాయలు 30, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 7, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 62, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు40, దోస కాయలు 22, పొటల్స్ 54, వెల్లుల్లి (పెద్దవి) 64, కొబ్బరి కాయ (పెద్దది) 35, బీట్‌రూట్ 42, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 22, కాప్సికమ్ 68, పొట్ల కాయ (పెద్దది) 26, చేమదుంపలు 26, చిలగడదుంపలు 32, కంద దుంప 50, దేముడు చిక్కుడు 56, గోరుచిక్కుడు 50, కూరాపెండలం 38, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 70, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు80, బూడిదగుమ్మడికాయ 20, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

విద్యార్థి దశలో పౌష్టికాహారం తప్పనిసరి

- జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు
- గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లోని పలు పాఠశాల్లో విద్యార్థులకు చిక్కీలను పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు


పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ఆర్పీపేట(కంచరపాలెం) ,డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందినప్పుడే వారు ఆరోగ్యవంతులై చదువులో రాణించగలరని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. రామ్మూర్తి పంతులు పేటలో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అక్షయపాత్ర సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉదయం అల్పాహార సమయంలో అందించనున్న పౌష్టికాహార పంపిణీని గణబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షయ పాత్ర ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచి, శుభ్రతతో కూడిన భోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఉదయం అల్పాహారం సమయంలో కూడా వీరికి మంచి పౌష్టికాహారం అందించేనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ఇక నుంచి విద్యార్థులకు పాఠశాలలో వారంలో మూడు రోజులు పాటు చిరు ధాన్యాలతో తయారు చేసిన చిక్కీలు, వేరుశెనగలు, ప్రోటీన్ బార్‌లు అందిస్తున్నట్టు తెలిపారు. డిసెంబరు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.దివాకర్ టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బాలచెరువు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన న్యూట్రీషన్ ఫుడ్‌ను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి నెలా ఖర్జూరం, బెల్లంచిక్కీలు, వంటి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవడంతో పాటు, పౌష్టికాహారాన్ని తీసుకుని ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని వార్డు పరిధిలో మింది, అక్కిరెడ్డిపాలెం హైస్కూళ్లలో మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెండు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గుడివాల లతీశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వానికి ముఖ్యం

కూర్మన్నపాలెం: విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87 వార్డు కణితి హైస్కూలు విద్యార్థులకు చిక్కీలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ వారంలో మూడు రోజులు పాటు పౌష్టికాహారాన్ని అందజేస్తారని అన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలను అభినందించారు. ఈ క్యాక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్ని రూట్లలో బస్సులు పెంచాలని వినతి


ఎమ్మెల్యే పల్లాకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ ఎన్ఎంయూఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై శ్రీనివాసరావు

మల్కాపురం/ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని రూట్లలోను బస్సుల సంఖ్య పెంచాలని, అందుకు కొత్తబస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్‌యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వై శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఏకే శివాజీ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత ప్రయాణం వల్ల మహిళలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్గో రవాణా సేవలను పెంచి ఆర్టీసీకి ఆదాయం పెంచాలని కోరారు. స్టీల్‌సిటీ డిపో కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని, డ్రైవర్, కండక్టర్, మెకానిక్ ఖాళీపోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆర్‌టీసీలో ఉద్యోగం చేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. దీనికి తొలుతుగా అసోసియేషన్ ప్రతినిధులు పల్లా శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు, జోనల్ కార్యదర్శి ఎంవీఆర్‌మూర్తి ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా జరగాలి

గాజువాక: గాజువాకలో అభివృద్ధి పనులు వేగంగా జరగాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పలు విభాగాల అధికారులకు సూచించారు. గాజువాక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పలు విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన ప్రతి పనిని త్వరగా పూర్తిచేయాలని, ప్రతి రహదారికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్ మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శేషాద్రి, ఈఈ రాయల్‌బాబు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

పెదగంట్యాడ: మత్స్యకార నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని టీడీపీ 64వ వార్డు ప్రధానకార్యదర్శి కదిరి పోలరాజు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు గాజువాక టీడీపీ కార్యాలయంలో మంగళవారం వినత పత్రాన్ని అందజేశారు. కొత్తదిబ్బపాలెం, గంగవరం, పల్లిపాలెం, జాలరిపల్లిపాలెం, చినపాలెం గ్రామాల్లో మత్స్యకార యువకులు అనేక మంది నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి స్టీల్‌ప్లాంట్‌లో కాని, దాని అనుబంధ పరిశ్రమల్లో కానీ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకారులు చేపల వేట సాగించేందుకు అనువుగా యారాడ సమీపంలో జెట్టీ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తిలో కార్పొరేషన్ నిధులు రూ.3.53 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన నిర్వహించనున్నామని టీడీపీ వార్డు అధ్యక్షుడు పెంటకోట రాజేంద్రప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రూ.1.55 కోట్లతో పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, రూ.1.98 కోట్లతో బృందావన్ కాలనీలో థీమ్ పార్క్ నిర్మాణం చేయనున్నామని తెలపారు. నగర మేయరు పీలా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేయనున్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ములకలపల్లి ప్రకాశ్

సింధియా, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్ నగర్ ప్రాంతానికి చెందిన ములకలపల్లి ప్రకాశ్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పొనతల సురేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.

భారీ వృక్షాలతో గోడలకు బీటలు



చెట్లు పెరగడంతో బీటలు వారిన గోడ

గోపాలపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన మొక్కలు భారీ వృక్షాలుగా పెరిగి ప్రమాదభరితంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. హుదూద్ తుఫాన్ తరువాత 89వ వార్డు నాగేంద్రకాలనీ సామాజిక భవనం చుట్టూ మొక్కలు నాటారు. అయితే ప్రస్తుతం అవి భారీ వృక్షాలుగా మారాయి. ఈ వృక్షాలు ప్రహరీకి ఆనుకుని ఉండడంతో గోడకు బీటలు వచ్చాయి. అంతేకాకుండా వర్షాలు కురిసే సమయంలో కొమ్మలు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'విజ్ఞాన్' ఏఐసీఈటీ ల్యాబ్‌కు జాతీయ స్థాయిలో 5వ స్థానం

అగనంపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల రూపొందించిన ఏఐసీఈటీ ల్యాబ్‌కు జాతీయస్థాయిలో 5వ స్థానం లభించినట్టు ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తి, అభివృద్ధి, నైపుణ్యం ఆధారిత అభ్యాసంపై విద్యార్థులు రూపొందించిన ఏఐసీఈటీ ల్యాబ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం హర్షణీయం అన్నారు. ల్యాబ్‌కు సంబంధించిన అన్ని కార్యకలాపాలు ప్రణాళిక, మానిటరింగ్ చేయడంలో కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ నాయక్ కృషి అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లెలను అభివృద్ధి చేయడమే ధ్యేయం

- 'మన పల్లెకు.. మన ఎమ్మెల్యే'లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


గుర్రమ్మపాలెంలో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ పల్లెలను అభివృద్ధి చేయడమే ధ్యేయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని గుర్రమ్మపాలెంలో 'మన పల్లెకు.. మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈ ఇంటింటికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. ప్రతి పేద కుటుంబా నికి సొంత ఇల్లు నిర్మించాలన్న ప్రభుత్వం చేపట్టిన పీఎంఏజీపై సర్వే ఈనెల 14 వరకు చేపట్టాను న్నామని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈ క్రమంలో గుర్రమ్మ పాలెం ఇందిరమ్మ కాలనీలో సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వెంటనే స్పందించి నెల రోజుల్లో మౌలిక వసతులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంత రం ఎన్టీఆర్ కాలనీలో సీసీ రోడ్డును ఆయన ప్రారం భించారు. బొడ్డుపూడిపాలెం, అక్కిరెడ్డిపాలెంలో పర్యటించి వివిధ సమస్యల నుంచి అర్జీలు స్వీకరి ంచారు. ఈ సందర్భంగా ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీల్లో తిష్ఠ వేసిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా పనిచేస్తున్నామని తెలిపారు.

చురుగ్గా రాజీవ్‌గాంధీ స్టేడియం రోడ్డు విస్తరణ పనులు


ఎక్స్‌కవేటర్ సాయంతో డ్రైనేజీ తవ్వుతున్న దృశ్యం

పెదగంట్యాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలచెరువురోడ్డు వికాస్‌నగర్ జంక్షన్ నుంచి రాజీవ్ గాంధీ స్టేడియం వరకు రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఈ రోడ్డును ఆధునీకరిస్తున్నారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ, ఫుట్‌పాత్, రోడ్డు మధ్యలో డివైడర్, దానిమీద లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నారు. రాజీవ్‌గాంధీ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ జరుగుతున్న దృష్ట్యా బీసీ రోడ్డు నుంచి స్టేడియంకు వెళ్లే రోడ్డును అన్ని హంగులతో ఆధునీకరించేందుకు పనులు చేపట్టారు. మూడు నెలల వ్యవధిలో రోడ్డు విస్తరణ, లైటింగ్ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనులు కొనసాగిస్తున్నారు. ముందుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్నచిన్న ఆక్రమణలను తొలగించారు. ఆ స్థానంలో డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ను నిర్మిస్తున్నారు. జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయి.

నరవలో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్ ప్రారంభం



నరవ గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన పోలీస్ సబ్ కంట్రోల్

గోపాలపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నరవ గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన పోలీస్ సబ్ కంట్రోల్ ఎట్టకేలకు ప్రారంభమైంది. 88వ వార్డు నరవ, కోటనరవ, సత్తివానిపాలెం, గవర జగ్గయ్యపాలెం, జెర్రిపోతులపాలెం పరిసర ప్రాంతాలు పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోనికి వస్తాయి. ఈ ప్రాంతాలు పోలీస్‌స్టేషన్‌కు 18 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగేది. జనాభా కూడా వేల సం ఖ్యలో పెరిగింది. పోలీసు నిఘా ఈ ప్రాంతంలో తక్కువ ఉండడంతో గంజాయి రవాణా కూడా ఎక్కువ జరిగేది. అయితే ఈ ప్రాంతాలను మరొక స్టేషన్ పరిధిలో చేర్పితే పోలీసుల నిఘా ఉండే అవకాశాం ఉంటుందని భావించి గతంలో ప్రతపా దనలు కూడా జరిగాయి. అయితే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోవడంతో ఈ ప్రాంతంలోని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా రెండేళ్ల నుంచి పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. గ్రామ కూడలిలో ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోలీసులు విధులు నిర్వహి ంచే వారు. పోలీసులు ఉండటానికి సరైన నీడలేకపోవడంతో ఇబ్బంది పడే వారు. ఈ క్రమంలో గ్రామ కూడలిలో కొద్ది నెలల క్రితం సబ్ కంట్రోల్ ఏర్పా టు చేశారు. తాజాగా ఈ భవనాన్ని ప్రారంభించడంతో పోలీసులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పోలీస్ సబ్ కంట్రోల్ ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


విద్యార్థులు సేకరించిన విరాళాలను అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అంధుల సంస్థ ఆర్గనైజర్‌కు రూ.1.16 లక్షల సాయం

ఆటోనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రియానం నయనం ప్రధానమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. 70వ వార్డు శ్రీనివాస నగర్‌లో మంగళవారం స్నేహ నేత్ర నిరుద్యోగ అంధుల సంస్థ ఆర్గనైజర్ రాజుకు సాయి విద్యానికేతన్ విద్యార్థులు, యాజమాన్యం సంయుక్తంగా రూ.1.16 లక్షలను పీవీఎన్ మాధవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు సాయం చేసే గుణాన్ని అలవాటు చేసిన స్కూల్ డైరెక్టర్ నాగుల రవికుమార్‌ను అభినందించారు. అనంతరం రవికుమార్, కృష్ణంరాజులు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని, కష్టాల్లో ఉన్నవారికి సాయపడాలన్నా సంకల్పం చిన్నారుల్లో కల్పించాలన్నదే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు దేనంకొండకృష్ణంరాజు, మానవతా ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

'క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు'

గాజువాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గాజువాక బీజేపీ ఇన్‌చార్జి కరణంరెడ్డి నరింగరావు అన్నారు. ఇటీవల ఆర్‌జీఐ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను గాజువాక అమరావతి పార్కులో మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవటం వలన ఆత్మ రక్షణతో పాటు ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. క్రీడాకారులకు విద్యా, ఉపాధి అవకాశాలు మరింత మెగురుపడతాయని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ శరత్‌కుమార్, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కరించాలని వినతి

గాజువాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డు జగజ్జీవన్‌రామ్ కాలనీలో నివాసముంటున్న వారిలో కొంత మందికి ఇళ్ల పట్టాల సమస్య ఉందని, దానిని పరిష్కరించాలని కోరుతూ గాజువాక తహశీల్దార్ బి.శ్రీనివాసరావుకు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవాం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లగా నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి స్కీములు వర్తింపచేశామన్నారు. ఇళ్ల పట్టాలకు మాత్రం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయలేదని సూచించారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించి రిజిస్ట్రేషన్లు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం'

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధి చేస్తూ ప్రజలకు సురక్షిత పాలన అందించగల సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు సునీల్ కొండాజీ అహిరే అన్నారు. బెల్ హెచ్‌పీవీపీ యూనియన్ కార్యాలయలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే గాజువాక నియోజకవర్గంలో అందరి ఆమోదయోగ్యంతో నాయకులను ఎంపిక చేసి పార్టీని మరింత పటిష్ఠం చేశామన్నారు. బీజేపీ చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

మల్కాపురం: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలందరూ కృషి చేయాలని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పరిశీలకుడు సునీల్ కొండాజీ అహిరే కోరారు. శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో విశాఖ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నియమకానికి సంబంధించి పశ్చిమ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ సూచన మేరకు జిల్లా అధ్యక్షుల నియామకం చేస్తామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మల్కాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండలంలో జీవీఎంసీ హైస్కూల్ గాంధీగ్రామ్‌లో హిందీ టీచర్ నియామకానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారులు కోరారు. ఈ పోస్టు వ్యవధి కేవలం ఐదు నెలలేనని తెలిపారు. ఈ పోస్టుకు గౌరవవేతనం కింద రూ.12.5 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు.

వృద్ధురాలిని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన పోలీసులు

పెందుర్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చలికి వణుకుతున్న వృద్ధురాలికి పోలీసులు ఆశ్రయం కల్పించి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని రాంపురంలో ఓ వృద్ధురాలు ఆదివారం రాత్రి చలికి వణుకుతూ స్థానిక మహిళలకు కనిపించింది. వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకి చేరుకుని ఆ వృద్ధురాలికి లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వృద్ధురాలి వివరాలను పోలీసులు వాట్సప్ గ్రూప్‌లో షేర్‌చేయగా డిసెంబరు 30న గాజువాక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసుగా నమోదైంది. ఆమె కుమార్తె గౌడు లక్ష్మి పోలీసులు ఆశ్రయం కల్పించిన వృద్ధురాలిని తన తల్లి లక్ష్మిగా గుర్తించింది. దీంతో బుధవారం ఆ వృద్ధురాలిని బంధువుల చెంతకు చేర్చారు.

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారాలు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ బస్టాప్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి ఆ వ్యక్తి మరణించాడు. అతని వద్ద ఎటువంటి ధ్రవపత్రాలు లేవు. ఈ విషయాన్ని కార్పొరేటర్ బొమ్మిడి రమణకు తెలియజేశారు. దీంతో ఆయన సొంత ఖర్చులతో దహన సంస్కారాలు చేయించారు.

అదనపు అంతస్థు నిర్మాణానికి శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు కాకానీ నగర్‌లో సామాజిక భవనంపై కార్పొరేషన్ నిధులు రూ.35 లక్షలతో చేపట్టే అదనపు అంతస్థు నిర్మాణానికి కార్పొరేటర్ బొమ్మిడి రమణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మౌలికవసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పేర్కొన్నారు. కూటమి పాలనలో అభివృద్ధి ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

5న ఇస్లాంపేట జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పీటీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ జె.వివేకనందరావు తెలిపారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఉదయం 9గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని, కళాశాల ప్రగతికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.


'ఉత్పత్తితో వేతనాలు ముడిపెట్టడం సరికాదు'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉత్పత్తితో వేతనాలు ముడిపెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని స్టీల్ ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్, ఇంటక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు పేర్కొన్నారు. ప్లాంట్‌లో రికార్డు స్థాయిలో ఉత్పత్తి సాధించినప్పటికీ వేతనాలు మాత్రం సరిగా ఇవ్వలేదన్నారు. యంత్రాలకు మరమ్మతులు చేయించక, కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా బయటకు పంపేయడం వంటి సమస్యలు ఉన్నాయని వాపోయారు. ఉత్పత్తి మెరుగ్గానే వస్తోందన్నారు. జీతాల విషయంలో యాజమాన్యం మరోసారి ఆలోచించాలని కోరారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.





కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గోట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

కళాకారులకు పీఎం విశ్వకర్మ యోజన



కార్యక్రమంలో సెంథిల్‌కుమార్, తదితరులు

మద్దిలపాలెం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా కళాకారులు, చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం అందుతుందని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సెంథిల్ కుమార్ తెలిపారు. జనశిక్షణ సంస్థాన్‌లో మంగళవారం నిర్వహించిన పీఎం విశ్వకర్మ మార్కెటింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ యోజన ద్వారా ఐదేళ్లలో 30 లక్షలమంది చేతివృత్తుల వారికి రూ.13వేల కోట్లు రుణం అందించడం లక్ష్యమన్నారు. నైపుణ్య శిక్షణ, ఉచిత క్రెడిట్, ఆధునిక సాధనాల కొనుగోలు, డిజిటల్ చెల్లింపులు ప్రోత్సహించడం, మార్కెటింగ్‌కు మద్దతు పథకం ప్రయోజనాలని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ, ప్రభుత్వ మద్దతు వివరించారు. ఈ కార్యక్రమంలో జనశిక్షణ సంస్థాన్ ఛైర్మన్ రామరాజు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ జోనల్ మేనేజర్ శ్రీదేవి, ఏయూ ఆచార్యులు కేకే చంద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

» అధికారులకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశం

మహారాణిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చితో కలిసి రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైవేలో జీబ్రా క్రాసింగ్ వద్ద సోలార్ బ్యాంకర్లు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రమాదాల్లో క్షతగాత్రుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన బాధితులకు అందుతున్న పరిహారంపై ఆరా తీశారు. ప్రమాదాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగారు. ప్రధాన రహదారుల్లో పాఠశాలలు, కళాశాలల వద్ద స్పీడు బ్రేకర్ల ఏర్పాటు, అవసరమైన చోట బస్‌షెల్టర్ల నిర్మాణంతో పాటు భారీ వాహనాలను నిలిపేందుకు వీలుగా ట్రక్ బేలు ఏర్పాటుచేయాలని సూచించారు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణ గురికాకుండా జీవీఎంసీతో కలిసి చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన కూడళ్లలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చెట్ల కారణంగా లైటింగ్ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖ, జీవీఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ

గడువులోగా ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తిచేయాలి

ఫిషింగ్ హర్బర్‌లో పనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో మంగళవారం నిర్వహించిన ఫిషింగ్ హార్బర్ హైలెవెల్ సమావేశంలో హార్బర్ ఆధునికీకరణ, సపరిశుభ్రత, వసతుల కల్పనపై కలెక్టర్ సమీక్షించారు. నీటి సరఫరాపై పోర్టు అధికారులతో సమన్వయం చేసుకోవాలని మత్స్యశాఖ జేడీని ఆదేశించారు ఈ సమావేశంలో పోర్టు చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్రమూర్తి, అరుణకుమార్, ఎంపెడా డీడీ మహంతి, మత్స్యశాఖ అధికారులు లక్ష్మణరావు, ఆశాజ్యోతి, బోటు ఆపరేటర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజియంను అందంగా తీర్చిదిద్దండి

» జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరం వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్‌ఆర్) నాటికి బీచ్‌రోడ్డులోని విశాఖమ్యూజియంను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన మంగళవారం మ్యూజియంను సందర్శించారు. ఐఎఫ్‌ఆర్ ఏర్పాట్లలో భాగంగా ఇటీవల అపెక్స్ కమిటీ కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో నేవీ అధికారులు కొన్ని విషయాలను వెల్లడించారన్నారు. ఐఎఫ్‌ఆర్‌కు వచ్చే విదేశీప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరఫున వచ్చే అతిథులు సందర్శించే ప్రాంతాల జాబితాను ఇచ్చి ఏర్పాట్లు చేయాలని కోరారన్నారు. మేరిటైం హెరిటేజ్ మ్యూజియంతోపాటు అన్ని వస్తువులను క్రమపద్ధతిలో అమర్చడం, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. మ్యూజియంలో లాండ్‌స్కేపింగ్, సివిల్ వర్క్స్ త్వరితగతిన పూర్తిచేయాలని, సందర్శకులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిపై ఫిర్యాదు

అక్రమాలపై విచారణకు జనసేన కార్పొరేటర్ వినతి

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు బ్యాంకులో పాల్పడిన అక్రమాలపై విచారణ చేపట్టాలని జనసేన కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ రాష్ట్ర సహకార శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఈ ఏడాది జూన్‌లో బాధ్యతలు స్వీకరించిన తరువాత పలు రకాల ఉల్లంఘనలను పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బ్యాంకులో పనిచేసే కొందరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది సేవలు అందించే సంస్థకు కాదని తనకు సన్నిహితంగా ఉండే వ్యక్తికి సదరు కాంట్రాక్టు అప్పగించారని ప్రస్తావించారు. దీనిపై సహకారశాఖలో సెక్షన్- 51 కింద విచారణ చేపట్టాలని కోరారు. కాగా పర్సన్ ఇన్‌చార్జిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సహకారశాఖ కమిషనర్, ప్రభుత్వం వేర్వేరుగా బ్యాంకు ఉన్నతాధికారులను ఆదేశించారు.

పనితీరులో మార్పు రాకుంటే సస్పెండ్ చేస్తా

» సాగర్‌నగర్-1 సచివాలయ సిబ్బందికి కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరిక



సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

సాగర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యం చేరుకునే క్రమంలో వారం రోజుల్లో పురోగతి కనిపించకపోతే సస్పెండ్ చేయకతప్పదని సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ హెచ్చరించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సాగర్‌నగర్-1,2 సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయం-1లో ప్రభుత్వ లక్ష్యాల మేరకు పురోగతి లేకపోవడాన్ని గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిటిజన్ సర్వే, ఈకేవైసీలో బాగా వెనుకబడి ఉన్నారని, ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని నిలదీశారు. 400 మంది ఈకేవైసీ పెండింగ్ ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ పూర్తిచేసేందుకు వారం రోజుల గడువు విధించారు. అప్పటికీ పురోగతి లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అప్‌డేట్‌గా ఉండాలన్నారు. సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి ఉన్నారు. అనంతరం సచివాలయం ఆవరణలోనే ఉన్న యూపీహెచ్‌సీని సందర్శించి, అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి విశాఖలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ సీతమ్మధారకు చెందిన షేక్ సుభాన్ (69) గత నెల 30న బైక్‌పై ఎలమంచిలి నుంచి రేగుపాలెం వైపు వెళ్తుండగా మల్లవరం వద్ద ట్రాఫిక్ ఎస్ఐ తనిఖీలు చేస్తున్నారు. దీంతో సుభాన్ బైక్‌ను వెనక్కు మళ్లించే ప్రయత్నంలో స్కూటీని ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. బంధువు మహమ్మద్ ఖాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మార్ఫింగ్ ఫొటోలతో మహిళకు వేధింపులు

» నిందితుడ్ని అరెస్టు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

ఎండాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన మహిళను ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకుని, వ్యక్తిగత ఫొటోలను తీసుకుని, మార్ఫింగ్ చేసి ఇబ్బందులకు గురిచేసి, డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్న నిందితుడ్ని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఓ వ్యక్తి నగరానికి చెందిన మహిళను ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకున్నాడు. నీట్‌లో సీటు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ప్రేమ నాటకంతో ఆమె ఫొటోలను సేకరించాడు. నీట్‌లో సీటు కావాలంటే రూ.30 లక్షలు అవుతుందనడంతో ఆమె నిరాకరించింది. దీంతో ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి, చోరీ చేసిన ఫోన్‌లు, సిమ్ కార్డులను వినియోగించి ఆమె వాట్సాప్ ఖాతాకు పంపాడు. డబ్బులు ఇవ్వాలని బెదిరింపు మెసేజ్‌లు పెడుతున్నాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న సైబర్‌క్రైమ్ పోలీసులు నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన మదినాపాటి నాగులమీరాగా గుర్తించి అరెస్టు చేశారు. గతంలోనూ అతడు నగరానికి చెందిన మహిళను మోసగించి రూ.3.5 లక్షలు దోచినట్టు దర్యాప్తులో గుర్తించారు.

జాతీయ రగ్బీ పోటీలకు లక్ష్మీపురం విద్యార్థిని



విద్యార్థిని శ్రావ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ రగ్బీ పోటీలో పాల్గొనేందుకు లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కరుభుక్త శ్రావ్య జిల్లా నుంచి ఎంపికయింది. గత నెల 28, 29 తేదీల్లో నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న శ్రావ్య ఉత్తమ ప్రతిభ చూపడంతో జాతీయస్థాయికి ఎంపికైనట్టు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు డి.సత్యారావు, వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగామంగళవారం పాఠశాలలో హెచ్ఎం సత్యారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రావ్యను ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు చాలామంది విద్యార్థులు ఎంపికయ్యారని, అయితే మొదట్టమొదటి సారిగా జాతీయస్థాయికి శ్రావ్య ఎంపికవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మెకు శాలువా కప్పి, పుష్ప గుచ్ఛాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ మొకర శంకరరావు, వైస్ ఛైర్మన్ కరుభుక్త రమణ, గాడు తాతినాయుడు, పైడినాయుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖ-బెంగళూరు, విశాఖ-తిరుపతి, విశాఖ-చర్లపల్లి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. విశాఖ-బెంగళూరు-రైళ్లకు ఈ నెల 7 నుంచి 29 వరకు, విశాఖ-తిరుపతి-విశాఖ్లకు ఈనెల 3 నుంచి జనవరి 1 వరకు, విశాఖ-చర్లపల్లి-విశాఖకు ఈ నెల 5 నుంచి 27 వరకు ఒక్కో థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు నామినేటెడ్ తేదీల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.